Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్త రోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు, చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు, ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు


జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :66 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు గురువారం 16 జూలై 2026 పేజీలు :12 వెల రూ5 /-


## ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోతున్నారు...

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి: మంత్రి తుమ్మల

వర్షాలు లేకపోవడం వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారన్న తుమ్మల

ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామని వెల్లడి

వర్షాల మీద రాజకీయాలు చేయడం సరికాదని వ్యాఖ్య



ఎల్‌నినో ప్రభావంతో రైతన్నలు కొంత నష్టపోతున్నారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అనుకున్న సమయానికి వర్షాలు లేకపోవడం వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. దానికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల వైపు వెళ్తే బాగుటుందని సూచించారు. రేపటి నుంచి ఆగస్టు రెండో వారంలోగా ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఆయా జిల్లాల వారీగా వివరాలు తీసుకుంటామని - మిగతా3లో

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి

ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు రేవంత్ శంకుస్థాపన

2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం

ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలకు ఆహ్వానం

మెట్రో విస్తరణ, ఈవీ బస్సులు, మూసీ ప్రక్షాళనకు ప్రాధాన్యం

భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందించాలని ఆదేశం



ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల మరిన్ని పెట్టుబడులు, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలను ఆహ్వానిస్తున్నామని రేవంత్ తెలిపారు. గతేడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు 108 దేశాల నుంచి పరిశ్రమలు పాల్గొన్నాయని గుర్తు చేశారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దతామని పేర్కొన్నారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో తెలంగాణ వాటా 10 శాతం ఉండేలా కృషి చేస్తామని అన్నారు. ఈ లక్ష్యాల సాధనకు భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు అవసరమని, అందుకే - మిగతా3లో

## తెలంగాణలో 'సర్' గడువు పొడిగింపు




**హైదరాబాద్, జులై 15:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) పొడిగించింది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం బుధవారం సవరించింది. దీంతో BLO\ ఇంటింటి సర్వేకు ఆగస్టు 3 వరకు గడువు పొడిగించినట్లు అయింది. ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయనుంది. సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనుంది. అక్టోబర్ 8వ తేదీ వరకు అభ్యంతరాలను పరిష్కరించనుంది. అక్టోబర్ 12న తుది ఓటరు జాబితాను ప్రచురించనుంది. సర్ గడువును పొడిగించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దీంతో సర్ షెడ్యూల్‌ను సీఈసీ సవరించింది. దీనిని అధికారులతోపాటు రాజకీయ పార్టీలకు తెలియజేయాలని జారీ చేసిన ఆదేశాల్లో సీఈసీ స్పష్టం చేసింది.

## ఈనెలలోనే 50 నామినేటెడ్ పోస్టుల భర్తీ..

### మహేశ్ గౌడ్ కీలక ప్రకటన




**హైదరాబాద్, జులై 15:** ఈ నెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఈరోజు(బుధవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ గాంధీభవన్ రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పనితీరు బాగుందని మహేశ్ గౌడ్ కితాబిచ్చారు.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ...

శిలాతోరణం వరకు క్యూలైన్లు

శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం

వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి శిలాతోరణం వరకు చేరిన క్యూలైన్లు

మంగళవారం 75 వేల మందికి పైగా స్వామివారి దర్శనం

ఒక్కరోజే రూ. 4.36 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం



తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వస్తుండడంతో కొండపై రద్దీ వాతావరణం కొనసాగుతోంది. శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపల శిలాతోరణం వరకు విస్తరించాయి. నిన్న మంగళవారం (జూలై 14) ఒక్కరోజే 75,485 మంది భక్తులు స్వామివారిని - మిగతా3లో

## గులాబీ రెడ్ పాలిటిక్స్..




**హైదరాబాద్, జులై 15:** తెలంగాణలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని, ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయడం లేదని ఆరోపిస్తూ.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ పార్టీ బ్లెడ్ పాలిటిక్స్(రక్త రాజకీయం) కు తెరదీసింది. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల రక్తం చవిచూస్తున్నారని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. సీఎంకు కావాలంటే తమ రక్తం ఇస్తామని, రైతులను ఆదుకోవాలని ఎక్స్ వేదికగా కామెంట్లు చేశారు. అనంతరం.. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ విద్యార్థి, యువజన విభాగం కార్యకర్తలు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పలువురు విద్యార్థులు రక్తం దానం చేశారు. అనంతరం.. ఈ రక్తాన్ని సచివాలయానికి తీసుకువెళ్లి.. సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చి.. నిరసన తెలపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ ఎస్ విద్యార్థి, యువజన విభాగం కార్యకర్తలను అడ్డుకుని రక్తం బాటిళ్లు, ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం నడిచింది. అయినప్పటికీ.. పోలీసులు మరింత మందిని రంగంలోకి దింపి బీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకున్నారు. ఇదిలావుంటే.. అసలు ఇంత రాజకీయం అవసరమా? అనేది పరిశీలకుల మాట. రైతులను ఆదుకునే విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వెనుకబడే ఉందని పలువురు గుర్తు చేస్తున్నారు. రాజకీయం చేసేందుకు అనేక అంశాలు ఉన్నాయని రైతులకు నీటిని విడుదల చేయకపోతే.. ఆ మేరకు మరో మార్గం ఎంచుకోవాలని చెబుతున్నారు. ఇక, బీఆర్ఎస్ బ్లెడ్ పాలిటిక్స్‌పై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. గతంలో బీఆర్ఎస్ పాలకులు రైతులకు సంకెళ్లు వేసి జైలుకు తరలించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం గమనార్హం. నల్గొండ, మహబూబాబాద్ వంటి జిల్లాల్లో రైతులు.. గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కితే లాఠీలతో ఎలా కొట్టించారో చూడండి.. అంటూ.. నాటి ఫొటోలను పోస్టు చేశారు. అంతేకాదు.. రైతులపై నాడు మంత్రి చేసిన వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించడం గమనార్హం. మొత్తంగా బీఆర్ ఎస్ బ్లెడ్ పాలిటిక్స్ ఎవరికి మేలు చేస్తాయో చూడాలి.

## 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ సాధించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం

### - సీఎం రేవంత్ రెడ్డి



**మహబూబ్ నగర్, జులై 15(స్పైన్యూస్ )** పారిశ్రామిక ,సాగునీటి, వ్యవసాయ రంగాలలో మౌలిక వసతులను కల్పించి స్పష్టమైన విధానాల రూపకల్పన ద్వారా 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ సాధించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా, దివిటిపల్లి సమీపంలోని అమరరాజా గిగా కారిడార్ ప్రాజెక్టులో భాగంగా అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్‌లో నూతనంగా నిర్మించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరరాజా సంస్థ దాదాపు నాలుగు దశాబ్దాల విజయవంతమైన ప్రయాణం అనంతరం తన తొలి భారీ పెట్టుబడిని తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానంపై పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. అమరరాజా ప్రపంచస్థాయి సంస్థగా ఎదిగి చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల కంపెనీలతో పోటీపడుతున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో ఎదగాలంటే అమరరాజా వంటి సాంకేతిక సంస్థలను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. వాతావరణ మార్పులు, కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం కీలకమని, వాటికి అవసరమైన అత్యాధునిక ఈవీ బ్యాటరీల తయారీలో తెలంగాణ ప్రధాన కేంద్రంగా అవతరిస్తోందని అన్నారు. మహబూబ్‌నగర్‌లో 32 గిగావాట్ గంటల సామర్థ్యంతో అమరరాజా కంపెనీలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక ఈవీ బ్యాటరీ తయారీ యూనిట్ రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ పరిశ్రమ ద్వారా 700 మంది ఇక్కడ మహబూబ్నగర్ జిల్లా వారికి ఉపాధి లభిస్తుండగా, వారిలో 400 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. అమర రాజా స్థాపించిన ఈ పరిశ్రమతో పాలమూరు జిల్లా రూపు రేఖలు మారుతాయని తెలిపారు..... - మిగతా2లో

# సంపాదకీయం

## వన్ నేషన్-వన్ ఎలక్షన్...

భారత రాజకీయ యవనికపై అత్యంత భారీ మార్పులకు కేంద్ర ప్రభుత్వం వేదిక సిద్ధం చేస్తోంది. ఒకేసారి మూడు చారిత్రాత్మక సంస్కరణలను అమల్లోకి తెచ్చేందుకు చట్టసభల్లో ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. వన్ నేషన్-వన్ ఎలక్షన్ , నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు కోసం పార్లమెంట్‌లో ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లులు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ రూపురేఖలను సంపూర్ణంగా మార్చేయబోతున్నాయి. ఈ మూడు బిల్లుల కలయిక కేవలం ఎన్నికల సంస్కరణ మాత్రమే కాదు, ఇది భారత ఫెడరల్ నిర్మాణాన్ని, ప్రాతినిధ్య రాజకీయాలను సరికొత్త దిశకు తీసుకెళ్లే ఒక సుదీర్ఘ ప్రయాణం.దేశవ్యాప్తంగా లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు భారత ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని, శ్రమను భారీగా తగ్గించడమే లక్ష్యంగా తెస్తున్నారు. పార్లమెంటరీ సంయుక్త కమిటీ అంచనాల ప్రకారం.. నిరంతరం ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరగడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు 7 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వల్ల నిలిచిపోయే అభివృద్ధి పనులకు విముక్తి లభిస్తుంది. అయితే, మధ్యలో ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం పడిపోతే, అక్కడ కొత్తగా ఎన్నికయ్యే సభ కేవలం మిగిలిన కాలపరిమితి కి మాత్రమే పరిమితం అవుతుందనే ప్రతిపాదన ప్రాంతీయ పార్టీలలో కొంత ఆందోళన కలిగిస్తోంది. ఈ విధానాన్ని 2029 కల్లా పూర్తి స్థాయిలో అమల్లోకి తేవాలని కేంద్రం గట్టి పట్టుదలతో ఉంది.1971 జనాభా లెక్కల ఆధారంగా స్తంభింపజేసిన లోక్‌సభ స్థానాల పరిమితిని సవరించి, నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం ప్రతిపాదించిన చట్టాల ప్రకారం.. లోక్‌సభ గరిష్ట స్థానాల సంఖ్యను 550 నుండి ఏకంగా 850కి పెంచే అవకాశం ఉంది. ఎవరికీ అన్యాయం జరగకుండా యాభై శాతం సీట్ల ఫార్ములాను తీసుకు వచ్చింది. గతంలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కావాలంటే జనాభా లెక్కలు, పునర్విభజన పూర్తి కావాలనే నిబంధన ఉండేది. కానీ, తాజా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న డేటా ఆధారంగానే మహిళా కోటాను తక్షణమే అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనివల్ల రాబోయే 2029 సాధారణ ఎన్నికల నాటికి లోక్‌సభ , రాష్ట్రాల అసెంబ్లీలలో 33 శాతం స్థానాలు మహిళలకే దక్కుతాయి. ఇది భారత రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని క్రింది స్థాయి నుండి అగ్రస్థాయి వరకు అనూహ్యంగా పెంచే విప్లవాత్మక మార్పు కానుంది.ఈ మూడు మహా బిల్లులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. పునర్విభజన జరిగితేనే పెరిగిన సీట్లలో మహిళా రిజర్వేషన్లు పక్కాగా అమలవుతాయి, ఆ సీట్ల ఆధారంగానే వన్ నేషన్-వన్ ఎలక్షన్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఈ స్థాయి భారీ రాజ్యాంగ సవరణలు కేవలం పార్లమెంట్‌లో సాధారణ మెజారిటీతో సాధ్యం కాదు. దీనికి రెండు పద్ధతుల ప్రత్యేక మెజారిటీ తో పాటు కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం తప్పనిసరి. ప్రాంతీయ పార్టీలను ఒప్పించడం, దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడటం, ఒకేసారి దేశవ్యాప్తంగా ఈవీఎంల సరఫరా వంటి భారీ లాజిస్టికల్ సవాళ్లు కేంద్రం ముందున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీలకు కలిపి దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే.. భారీగా ప్రభుత్వ ధనం వృథా తగ్గి.. ఖర్చులు కలిసి వస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని కూడా సమర్థవంతంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. సాధారణంగా అధికారులు ఎన్నికల విధుల్లో పూర్తిగా నిమగ్నమై ఉంటే పరిపాలనపై ప్రభావం పడుతుంది.. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే.. సమయం ఆదాతో పాటు రెండుసార్లు ఎన్నికలు జరగకుండా వారు పరిపాలనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుంది. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు తరచూ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడం కూడా తగ్గుతుంది. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటర్లు ఒకేసారి వచ్చి ఓటింగ్ వేయడం వల్ల పోలింగ్ శాతం కూడా పెరుగుతుందని లా కమిషన్ వెల్లడించింది.అయితే ఈ జమిలీ ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా కొన్ని రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం సహా ఇతర పార్లమెంటరీ ప్రొసీజర్లను కూడా సవరించాల్సి ఉంటుంది. దీని కోసం రాష్ట్రాల అంగీకారం కూడా కావాల్సి ఉంటుంది. ఒకే దేశం ఒకే ఎన్నిక అమల్లోకి వస్తే ప్రచారంలో జాతీయ అంశాలే అధిక ప్రాధాన్యత కలిగి ఉండి.. స్థానిక అంశాలు, సమస్యలు కనిపించకుండా పోతాయని ప్రాంతీయ పార్టీలు తీవ్రంగా భయపడుతున్నాయి. దీనికి తోడు ఎన్నికల ఖర్చులో కూడా జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడాల్సి రావడం మరింత ఇబ్బందిగా ఉంటుందని భావిస్తున్నాయి. అయితే 2015లో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం.. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తే 77 శాతం మంది ప్రజలు ఒకే పార్టీ లేదా కూటమికి ఓటు వేయనున్నారని తేలింది. అసెంబ్లీకి పార్లమెంట్‌కు వేర్వేరుగా నిర్వహిస్తే ఒకే పార్టీని ఎన్నుకొనే అవకాశాలు 61శాతానికి తగ్గినట్లు వెల్లడైంది.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1967 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దుకావడం, 1970 లో ఏడాది ముందే లోక్‌సభ రద్దు చేయడంతో ఈ విధానం మారిపోయింది. అయితే 1983 లో ఎన్నికల కమిషన్ మరోసారి జమిలీ ఎన్నికల ప్రతిపాదనను తెరపైకి తెచ్చినా.. ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. 1999 లో లా కమిషన్ నివేదిక ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని లేవనెత్తినా అది ఆచరణలోకి రాలేదు. 2016 లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ జమిలీ ఎన్నికల ఆలోచనను ప్రతిపాదించగా.. 2017 లో నీతి ఆయోగ్ కసరత్తు చేసింది. 2019 లో ఈ అంశంపై వివిధ పార్టీల నేతలతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు చేయగా.. కాంగ్రెస్ సహా చాలా ప్రతిపక్షాలు హాజరు కాలేదు. అయితే 2022 లో జమిలీ ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధమేనని సీఈసీ సుశీల్ చంద్ర ప్రకటించారు. 2022 డిసెంబర్‌లో జమిలీ ఎన్నికలపై లాకమిషన్ వివిధ పార్టీలు, ఈసీ, అధికారులు, విద్యావేత్తలు, నిపుణుల అభిప్రాయాలను ఆహ్వానించింది.ఇవన్నీ దాటుకుని బిల్లులు చట్ట రూపం దాలిస్తే, భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది సరికొత్త అధ్యాయం అవుతుంది. అయితే దీనికి సంబంధించిన బ్యాక్ గ్రౌండ్ వర్క్ ను ఎన్డీఏ పెద్దలు ఇప్పటికే పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది.

## జమ్మూలో బీజేపీ వర్సెస్ నేషనలిస్ట్ కాంగ్రెస్

**శ్రీనగర్ జూలై 15:**జమ్మూ కాశ్మీర్ లో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. బీజేపీ తన పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, తన ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూస్తున్నాయని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన ప్రకటన చేశారు. “ఆపరేషన్ లోటస్” పేరుతో తమ ప్రభుత్వాన్ని అస్థిరపచాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు.బీజేపీకి చెందిన ఓ కీలక నేత, సుప్రీంకోర్టు న్యాయవాది మా పార్టీ ఎమ్మెల్యేను రహస్యంగా కలిశారు. పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల నగదు, మంత్రి పదవి ఇస్తామని, జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తామని ఆశ చూపారు. కానీ మా ఎమ్మెల్యేల విశ్వాసాన్ని, నిబద్ధతను వారు కొనలేకపోయారు. రూ.100 కోట్లు ఇచ్చినా నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు అమ్ముడుపోరు.



బలహీనులుగా భావించి వెనుక ద్వారం గుండా అధికారంలోకి రావాలని బీజేపీ చూస్తోంది” అని తీవ్రంగా విమర్శించారు.జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ తమపై లేనిపోని అభాండాలు మోపుతున్నారని బీజేపీ మండిపడింది. రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిస్తూ సీఎం ఒమర్ కి బీజేపీ లీగల్ నోటీసులు కూడా పంపింది. ఒమర్ అబ్దుల్లా ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది పేర్కొన్నారు. తమపై చేసిన ఆరోపణలకు వెంటనే ఆధారాలు చూపాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత బీజేపీ తరఫున ఒమర్ అబ్దుల్లాకు అధికారిక లీగల్ నోటీసు పంపారు. ఆరోపణలను నిరూపించలేకపోతే లేదా బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రూ.100 కోట్ల పరువు నష్టం దావా దాఖలు చేస్తామని నోటీసులో పేర్కొన్నారు.

## నేపాల్ లో జెన్ జీ రచ్చ....

**ఖాట్మాండుజూలై 15:**నేపాల్ రాజకీయాల్లో సంచలన మార్పులతో అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న కొత్త ప్రభుత్వానికి కేవలం మూడున్నర నెలలకే తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదురవుతోంది. గత సెప్టెంబర్‌లో జెన్-జి నడిపిన ఉవ్వెత్తున లేచిన ఉద్యమం అప్పటి కేపీ శర్మ ఓలీ ప్రభుత్వాన్ని కుప్పకూల్చింది. ఆ యువ విప్లవం సృష్టించిన ప్రభంజనంతోనే మార్చిలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఏకంగా 182 స్థానాలను గెలుచుకుని చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. దీంతో కాఠ్‌మాండూ మాజీ మేయర్, యువ నేత బాలేంద్ర బాలెన్ షా ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టారు. కానీ, ఏ యువతైతే తమ ఆకాంక్షలను నెరవేరుస్తాడని ఆయన్ను పీఠంపై కూర్చోబెట్టిందో, ఇప్పుడు అదే యువత ఆయన తీసుకుంటున్న కఠిన నిర్ణయాలపై రోడ్లపైకి వచ్చి పోరాడుతుండటం గమనార్హం.ఈ తాజా సంక్షోభానికి కాఠ్‌మాండూ పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద జరిగిన గణేష్ నేపాలీ అనే యువకుడి ఆత్మహత్యే ప్రధాన కారణమైంది. దుబాయ్ వెళ్లాలనే కలలతో ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్న ఆ రైడ్-షేరింగ్ కార్మికుడి బైక్ ను పోలీసులు లాక్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఆత్మబలిదానం చేసుకున్నాడు. వారం రోజుల ముందే పోలీసులు అతని బైక్‌ను సీజ్ చేసి 1,000 జరిమానా విధించినట్లు తెలుస్తోంది. దీనికి తోడు, ఎలాంటి ప్రత్యామ్నాయ పునరావాసం చూపించకుండా దాదాపు 2,600 మంది భూమిలేని పేద కుటుంబాలను నిర్వాసితులను చేయడం, వరదల్లో స్వచ్ఛందంగా సేవలు అందించిన యువతపై పోలీసులు




లాఠీచార్జ్ చేయడంతో జనం ఆగ్రహం కట్టలు తెంచుకుంది.కాఠ్‌మాండూ మేయర్‌గా ఉన్నప్పుడు అక్రమ కట్టడాల కూల్చివేతలతో పాపులారిటీ తెచ్చుకున్న ఆయన, అదే బుల్డోజర్ తరహా క్లీనప్ పాలనను జాతీయ స్థాయిలో రుద్దాలని చూస్తూ పేదల పొట్టకొడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పెద్దల అవినీతిని అంతమొందించి, ఉద్యోగాలు కల్పిస్తారనే నమ్మకంతో యువత ఓటేస్తే.. ప్రభుత్వం మాత్రం కఠినమైన ట్రాఫిక్ నిబంధనలు, భారీ జరిమానాలతో చిరు వ్యాపారులు, వలస కార్మికులను వేధిస్తోందనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఒకే తప్పుకు మున్సిపల్ పోలీసులు 1,000, ట్రాఫిక్ పోలీసులు 500 చొప్పున వేర్వేరు చట్టాల కింద జరిమానాలు వసూలు చేస్తుండటం ఇక్కడి వ్యవస్థాగత గందరగోళానికి అద్దం పడుతోంది.ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్కృతిని నిర్మించింది స్వయంగా మాజీ మేయర్ అయిన ప్రధాని బాలెన్ షాయే. సంక్షోభం ఇంతలా ముదురుతున్నా ప్రధాని మౌనం వహించడం, కేవలం సోషల్ మీడియా ఇమేజ్‌తోనే దేశాన్ని నడపలేరని విమర్శకులు విమర్శిస్తున్నారు. రోజుకు 1,500 మంది ఉపాధి కోసం దేశం విడిచిపోతున్న నేపాల్ దయనీయ స్థితికి గణేష్ నేపాలీ ఉదంతం ఒక ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. అయితే పదవి చేపట్టి కొద్ది నెలలు కాక ముందే అద్భుతాలు చేసేయాలని అనుకోవడం కష్టమని జెన్ జీ భావించడం లేదు. అక్కడే సమస్య వస్తోంది.

## గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు.. ఐదుగురికి గాయాలు

**మెదక్, జులై 15**: జిల్లాలోని మనోహరాబాద్ మండల కేంద్రంలోని పరికిబండలో ప్రమాదం జరిగింది. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ నుంచి కమర్షియల్ సిలిండర్‌లోకి గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు సంభవించింది. ప్రమాద తీవ్రతకు గదిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. పేలుడు శబ్దానికి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఐదుగురు బీహార్‌కు చెందిన వలస కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. గాయపడిన వారు రాజేష్, గంగారాం, సంజీవ్, లాలాన్, దబల్ నాథ్‌గా గుర్తించారు. నిన్న(మంగళవారం) రాత్రి ఈ ప్రమాదం జరిగింది. అయితే వంట చేస్తుండగా గ్యాస్ పేలిందంటూ నమ్మించేందుకు అక్కడి వారు ప్రయత్నించారు. ఈరోజు ఉదయం పోలీసులు వెళ్లి చూడగా అసలు విషయం బయటపడింది. గ్యాస్ అక్రమ దందా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గత ఏడాది కాలంగా స్థానికంగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అక్రమంగా గ్యాస్‌ను ఫిల్లింగ్ చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ సాధించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం







- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలమైన విధానాలను మరింత బలోపేతం చేస్తూ పారదర్శక పాలన, అత్యుత్తమ మౌలిక వసతులు, పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. పారిశ్రామిక, పర్యాటక, క్రీడా రంగాలకు ప్రత్యేక విధానాలను అమలు చేస్తూ 2047 నాటికి దేశ అభివృద్ధిలో తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీ గా తీర్చిదిద్ది కీలక శక్తిగా నిలబెట్టే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.దేశ జనాభాలో తెలంగాణ కేవలం 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 10 శాతం వాటా సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నదని చెప్పారు. ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలను పారిశ్రామిక, సేవారంగ, వ్యవసాయ ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి తయారీ పరిశ్రమలను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఒకప్పుడు మహబూబ్నగర్ జిల్లాను దత్తత తీసుకునే స్థాయి నుండి, ప్రస్తుతం మనమే ఇతర జిల్లాలను దత్తత తీసుకునే స్థాయికి వచ్చామన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఇంజినీరింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీలు, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటుచేసి బలోపేతం చేస్తున్నామని తెలిపారు. పాలమూరు- రంగారెడ్డికి సంబంధించి 90 టీఎంసీల నీటి కేటాయింపుకై కేంద్ర ప్రభుత్వం తో పాటు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరిపి అవసరమైన నీటి కేటాయింపులు, అనుమతులు సాధించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలోనే పాలమూరు రైతులకు శుభవార్త అందిస్తామని తెలిపారు.మహబూబ్నగర్ జిల్లాలో కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, రాజోలిబండ (ఆర్‌డీఎస్) వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా అమర్ రాజా కంపెనీ 32 గిగావాట్ల ప్లాంటును ప్రారంభించుకోవడం ఒక నిదర్శనమని అన్నారు .2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించే లక్ష్యంగా ఎనర్జీ లక్ష్యాన్ని చేపట్టడం జరిగిందని, విద్యుత్ పరిశ్రమలే కాకుండా, ఎనర్జీ పరిశ్రమలు తీసుకురానున్నమని, క్లీన్ గ్రీన్ ఎనర్జీ పాలసీ తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. 2031 నాటికి ఈవి బ్యాటరీల వినియోగం నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రతి ఒక్కరు గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తున్నారని, బ్యాటరీ తయారీలో తెలంగాణ అద్భుతంగా ఉందని ,2023లో 6.8%గా ఉన్న పరిశ్రమల అభివృద్ధి 2026 నాటికి 8.1% చేరుకున్నామని, 2034 నాటికి 13% చేరుకునేలా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీ.కే అరుణ మాట్లాడుతూ అమర రాజా వంటి కంపెనీ మహబూబ్నగర్ ప్రాంతంలో ఉండడం ఈ ప్రాంతాలవాసుల అదృష్టం అని అన్నారు. ప్రస్తుతం మనం విదేశాల నుండి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నామని, మన డబ్బు విదేశాలకు పోకుండా మనమే అభివృద్ధి చేసుకునేలా ప్రధాన మంత్రి ఆలోచిస్తున్నారని తెలిపారు. మహబూబ్నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దివిటిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన అమర రాజా కంపెనీ గిగా మ్యానుఫ్యాక్చరింగ్ కారిడార్ గా రూపకల్పన కాబోతున్నదని, ఇది దేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉపయోగపడే ఫ్యాక్టరీ కాబోతున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా అన్ని పట్టణాలలో ఏటీసీ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పిస్తున్నామని, రాబోయే రోజుల్లో 30 వేల ఎకరాలలో అనేక కంపెనీలు రానున్నాయని తెలిపారు. అమర రాజా కంపెనీ సీఎండీ గల్లా జయదేవ్, విక్రమాదిత్య లు మాట్లాడారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ ,యువజన క్రీడల సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి, షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా,ఎస్పీ జానకి, తదితరులు ఉన్నారు. అంతకుముందు ముఖ్య మంత్రి అమరాజా కంపెనీలో హెలికాప్టర్ దిగిన వెంటనే మొక్కలు నాటారు. అంతేకాక కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంటు ప్రారంభోత్సవం అనంతరం వివిధ విభాగాలను సందర్శించి అక్కడ ఉత్పత్తి అవుతున్న బ్యాటరీలు, వాటి సామర్థ్యం, నాణ్యత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రక్షాళన...

# అసలేమిటీ 'ఎస్ఐఆర్'?

**ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఈసీ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్**

**నకిలీ, వలస వెళ్లిన ఓటర్లను తొలగించి, అర్హులను చేర్చడమే లక్ష్యం**

**ఇప్పటికే ముగిసిన రెండు దశలు**

**ఏపీ, తెలంగాణ సహా 16 రాష్ట్రాల్లో మూడో దశ సర్వే**

**ఏపీలో ఇంటింటి సర్వే గడువు జూలై 24 వరకు పొడిగింపు**

**ఓటర్లు బీఎల్‌వోలకు సరైన వివరాలు ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం**



దేశంలో ఎన్నికలను మరింత పారదర్శకంగా, కచ్చితత్వంతో కూడిన ప్రక్రియగా మార్చే దిశగా భారత ఎన్నికల సంఘం (జుజ×) ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' నకిలీ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా 'ప్రత్యేక ఓటరు జాబితాల సమగ్ర సవరణ' పేరిట ఈ దేశవ్యాప్త ప్రక్షాళన జరుగుతోంది. ఇప్పటికే రెండు దశల్లో విజయవంతమైన ఈ ప్రక్రియ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో మూడో దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో **SIR** అంటే ఏమిటి, అది ఎలా జరుగుతుంది, ఓటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో సమగ్రంగా పరిశీలిద్దాం.

### SIR అంటే ఏమిటి? ఎందుకు చేపట్టారు?

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితాను సమూలంగా సవరించే ప్రక్రియ. బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి, పాక్షికంగా నింపి ఉన్న ఎన్యుమరేషన్ ఫారాలను అందించి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరిస్తారు. దీని ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో శుద్ధి చేయడం. మరణించిన వారు, ఒకే వ్యక్తికి పలుచోట్ల ఓట్లు ఉండటం (నకిలీ ఓట్లు), శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, పౌరసత్వం లేని వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం ఈ ప్రక్రియలో కీలకం. అదే సమయంలో, అర్హత ఉండి కూడా జాబితాలో పేరు లేని వారిని చేర్చడం ద్వారా స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికల నిర్వహణకు వీలు కల్పించడం ఎన్నికల సంఘం లక్ష్యం. 2025 అక్టోబర్ 27న ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించారు. అయితే, ఈ ప్రక్రియపై కొన్ని రాజకీయ పక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో విషయం సుప్రీంకోర్టుకు చేరింది. 2026 మే నెలలో సర్వోన్నత న్యాయస్థానం దీనిపై స్పష్టతనిచ్చింది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజాప్రాతినిధ్య చట్టానికి అనుగుణంగానే ఉందని, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం రాజ్యాంగపరమైన బాధ్యత అని పేర్కొంటూ దాని చట్టబద్ధతను సమర్థించింది.

**దశలవారీగా అమలు.. ఇప్పటివరకు జరిగిందిదే**

**దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం దశలవారీగా అమలు చేస్తోంది.**

**మొదటి దశ (బీహార్):** ప్రయోగాత్మకంగా తొలి దశను బీహార్‌లో 2025 జూన్-సెప్టెంబర్ మధ్య చేపట్టారు. ఈ పరిశీలన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 47 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. ఇది అక్కడి మొత్తం ఓటర్లలో దాదాపు 5-6 శాతానికి సమానం.

**రెండో దశ (9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలు):** బీహార్ ప్రయోగం విజయవంతం కావడంతో, రెండో దశను ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా మొత్తం 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించారు. ఈ దశలో సుమారు 51 కోట్ల ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 2.04 కోట్ల పేర్లు, పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షల పేర్లు జాబితా నుంచి తొలగింపునకు గురయ్యాయి. ఈ ప్రక్రియ కోసం 5.3 లక్షల మంది బీఎల్‌వోలు, 7.64 లక్షల మంది బూత్ లెవెల్ ఏజెంట్లు పనిచేశారు.

**మూడో దశ (ఏపీ, తెలంగాణ సహా):** 2026 మే 14న ఎన్నికల సంఘం మూడో దశను ప్రకటించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మొత్తం 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ-కశ్మీర్, లడఖ్‌లలో వాతావరణ పరిస్థితులు, ఇతర కార్యక్రమాల దృష్ట్యా ూ×= షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తారు. ఈ దశలో 3.94 లక్షల మంది బీఎల్‌వోలు సుమారు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలను ధ్రువీకరించనున్నారు.

### SIR ప్రక్రియ ఎలా జరుగుతుంది? ఓటర్లు ఏం చేయాలి?

ఓటర్లు ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనడం చాలా ముఖ్యం. నిర్లక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రక్రియ కింది విధంగా ఉంటుంది.

**1.ఎన్యుమరేషన్ ఫారం పంపిణీ:** బీఎల్‌వోలు మీ ఇంటికి వచ్చి, మీ వివరాలతో పాక్షికంగా నింపి ఉన్న ఎన్యుమరేషన్ ఫారం అందజేస్తారు.

**2.వివరాలు నింపడం:** ఆ ఫారంలో గతంలో ఏ ఓటర్ల జాబితాలో (ఉదా: ఏపీ/తెలంగాణలో 2002 నాటి జాబితా) మీ పేరు నమోదైందో ఆ వివరాలు అందించాలి.

**3.సాక్ష్యాధారాల సమర్పణ:** పౌరసత్వాన్ని నిరూపించేందుకు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులు, జనన ధ్రువీకరణ పత్రం, 1987 జులై 1 లోపు జారీ చేసిన ప్రభుత్వ/బ్యాంకు/పోస్టాఫీసు గుర్తింపు పత్రాలు వంటివి సాక్ష్యాలుగా చూపించవచ్చు.

**4.రసీదు పొందడం:** నింపిన ఫారం రెండు ప్రతులుగా ఉంటుంది. బీఎల్‌వో ఒక ప్రతిపై సంతకం చేసి రసీదుగా మీకు ఇస్తారు. భవిష్యత్ అవసరాల కోసం ఈ రసీదును తప్పనిసరిగా భద్రపరుచుకోవాలి.

**5.గడువులోగా సమర్పణ**: నిర్దేశిత గడువులోగా ఫారం తిరిగి ఇవ్వకపోతే, మీ పేరు ముసాయిదా జాబితాలో రాదు. తర్వాత ఫారం-6 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

**6.ఆన్‌లైన్ సదుపాయం**: ఇంటికి దూరంగా లేదా ఇతర రాష్ట్రాల్లో ఉండే వారు ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్ **(voters.eci.gov.in)** ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఫారం నింపవచ్చు.

# యువతలో నైపుణ్యానికి పదును...

**వేములవాడ(రాజన్న సిరిసిల్ల):** ప్రతి సంవత్సరం జూలై 15వ తేదిన ఐక్యరాజ్యసమితి వరల్డ్ యూత్ స్కిల్స్ డేను ఘనంగా జరుపుకుంటోంది. యువతకు సాంకేతిక, వృత్తి నైపుణ్యాల ప్రాముఖ్యతను తెలియజేయడమే ముఖ్య ఉద్దేశ్యంగా ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. యువతకు ఉపాధి అవకాశాల కోసం డిగ్రీ చదువు ఒక్కటే చాలదని, ఇండస్ట్రీకి కావాల్సిన నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగంలో రాణించవచ్చని, స్వయం ఉపాధి, సొంతంగా వ్యాపారం, స్టార్టప్ పెట్టుకోవడానికి, డిజిటల్ యుగంలో ఏఐ, కోడింగ్, డిజిటల్ మార్కె టింగ్ వంటి కొత్త రంగాల్లో యువతను సిద్ధం చేయడం, గ్రామీణ యువతకు వ్యవసాయం, చేనేత, కుటీర పరిశ్రమల్లో ఆధునిక నైపుణ్యాలు నేర్పడమే లక్ష్యంగా యువజన నైపుణ్య దినోత్సవాన్ని చేపడుతుంటారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం రోజున భారత ప్రభుత్వం స్కిల్ ఇండియా మిషన్ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా ఉచిత శిక్షణ శిబిరాలు, జాబ్ మేళాలు నిర్వహిస్తుంది. రాష్ట్రంలో తెలంగాణ అకాడ మి ఫర్ స్కిల్, నాలెడ్జ్ ఆధ్వర్యంలో కాలేజీల్లో ఉచిత వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుంది. భారత ప్రభుత్వం అందించే స్కిల్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వయస్సు, కనీసం 8వ తరగతి చదివిన, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు అధిక ప్రాధాన్యతను కల్పిస్తుంది.

**స్కిల్ ఇండియా మిషన్ లక్ష్యం...**

భారత ప్రభుత్వం స్కిల్ ఇండియా మిషన్‌లో భాగంగా కౌశల్ భారత్-కుశల్ భారత్ పేరుతో సమర్థవంతమైన భారత్‌ను నిర్మించేందుకు యు వతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్ణ యించింది. ప్రధానమంత్రి ఆధ్వర్యంలో 15జూలై 2015లో అట్టహాసంగా ప్రారంభించారు. భవిష్యత్తులో భారత యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారిని ఉపాధికి సిద్ధం చేయడమే లక్ష్యంగా కొన్ని పథకాలను, కార్యక్రమాలను రూపొందించింది. అందులో ప్రధాన పథకాల వివరాలు..

1) పీఎంకేవీవై (ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం) ద్వారా 10, 12వ తరగతులు, పాస్, ఫెయిల్ అయిన యువతకు 4 నుంచి 24వారాల ఉచిత శిక్షణ, సర్టిఫికెట్స్, ప్లేస్‌మెంట్ కల్పించేందుకు అవకాశాలు కల్పించారు. 2) డీజీటీ, ఐటీఐ పథకంలో 8వ తరగతి పాస్ అయిన యువతకు 138 రంగాల్లో 2 సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లో




శిక్షణ. 3) జేఎస్ఎస్-జన్ శిక్షణ్ సంస్థాన్ ద్వారా గ్రామీణ, పట్టణ పేదలకు టైలరింగ్, మొబైల్ రిపెయిర్, బ్యూటీ వంటి 3 నుంచి 6 నెలల కోర్సులు. 4) ఎన్ఏపీఎస్- నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ ద్వారా ఆయా కంపెనీల్లో ఆన్ జాబ్ ట్రై నింగ్ చేస్తున్న వారికి శిక్షణతో పాటు స్టైఫండ్ కూడా అందిస్తారు. 5) పీఎం విశ్వకర్మ ద్వారా కమ్మరి, వడ్రంగి వంటి 18 వృత్తుల వారికి ఉచిత టూల్స్, శిక్షణలో రూ. 15 వేలతో పాటు లోన్ సౌకర్యం.

# రెండు చోట్ల రేవంత్ ఓటు...

**హైదరాబాద్, జూలై 15:** రాష్ట్రంలో చట్టాలను, నిబంధనలను పటిష్టంగా అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి పేరిట రెండు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటు హక్కు నమోదై ఉండటం ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బాధ్యతాయుతమైన అత్యున్నత పదవిలో ఉన్న ఒక వ్యక్తి పేరు, రెండు వేర్వేరు పార్లమెంటరీ పరిధులలోని ఓటర్ల జాబితాలో కనిపించడం సంచలనం సృష్టిస్తోంది. అధికారిక ఓటరు నమోదు డేటా ద్వారా ఈ విషయం స్పష్టమవడంతో, సోషల్ మీడియా వేదికగా నెటిజెన్లు, రాజకీయ విశ్లేషకులు దీనిపై రకరకాలుగా ఆరా తీస్తున్నారు.ప్రస్తుత ఓటర్ల జాబితా రికార్డుల ప్రకారం.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుత ఓటర్ల జాబితా రికార్డుల ప్రకారం.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి వచ్చే కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి ఓటరుగా నమోదై ఉన్నారు. అదే సమయంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం పరిధిలోని అచ్చంపేట అసెంబ్లీ నియోజక వర్గం ఓటర్ల జాబితాలో కూడా ఆయన పేరు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ రెండు చోట్లా ఉన్న ఓటరు నమోదు పత్రాలలో ఆశ్చర్యకరంగా ఒకే ఒక ఎలక్షన్ ఐడీ కార్డ్ నంబర్ (టీఈూ0274035) ఉండటం గమనార్హం. అచ్చంపేట పరిధిలోని వాంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని ఆయన నివాస గృహ నంబర్ 3-48 అడ్రస్‌తో ఒక ఓటు ఉంటే.. కొడంగల్ పరిధిలో హౌస్ నంబర్ 1-209 అడ్రస్‌తో రెండో ఓటు నమోదై ఉంది. 1. కొడంగల్ నియోజకవర్గం: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి వచ్చే కొడంగల్‌లో హౌస్ నంబర్ 1-209 అడ్రస్‌తో ఆయన ఓటు నమోదై ఉంది. 2. అచ్చంపేట నియోజకవర్గం: నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం పరిధిలోని అచ్చంపేట నియోజకవర్గం, వాంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని ఆయన ఇంటి నంబర్ 3-48 అడ్రస్‌తో మరో ఓటు నమోదై ఉంది. అయితే, ఇందులో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ రెండు వేర్వేరు నియోజకవర్గాల్లోని ఓటర్ల జాబితాలోనూ రేవంత్ రెడ్డికి ఒకే ఒక ఎలక్షన్ ఐడీ కార్డ్ నంబర్ (ఙజూ0274035) ఉండటం గమనార్హం. ఈ డబుల్ ఎంట్రీ రికార్డులలో ముఖ్యమంత్రి పేరు స్పెల్లింగ్‌లో కూడా తప్పులు దొర్లాయి. ఆయన పేరు అసలు స్పెల్లింగ్ "=వఝుత్ష్ట" కాగా.. రెండు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలోనూ నరసింహ రెడ్డి కుమారుడైన **Anumula Revant Reddy** అని నమోదై ఉంది.సాధారణంగా ఇలాంటి స్పెల్లింగ్ తప్పులను సరిదిద్దుకోవడానికి నిబంధనల ప్రకారం సంబంధిత ఓటర్ రిజిస్ట్రేషన్ అధికారికి ఫామ్-8 సమర్పించాల్సి ఉంటుంది. అలాగే, 1950 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఏ పౌరుడూ కూడా ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడు కాదనే కఠినమైన నిబంధన ఉంది. ఈ బహుళ ఓటు నమోదును తొలగించుకోవడానికి, తాము సాధారణంగా నివసించని నియోజకవర్గ పరిధిలోని అధికారికి స్వచ్ఛందంగా ఫామ్-7 సమర్పించి, ఒక ఓటును రద్దు చేయాలని కోరే చట్టపరమైన అవకాశం ఓటరుకు ఉంటుంది.దేశంలో బహుళ ఓట్ల నమోదు అంశంపై చట్టం చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. రెండు చోట్ల ఒకే వ్యక్తికి ఓటు ఉంటే ఏడాది జైలు శిక్ష తప్పదని ఇటీవలే ఎన్నికల సంఘం ప్రకటించింది. గతంలో ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు వంటి బహుళ రాష్ట్రాల్లో ఓటరుగా నమోదయ్యారనే ఆరోపణలపై బెంగళూరు కోర్టు నాన్-బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేయడం, ఆ తర్వాత ఆయన బెయిల్ పొంది చట్టపరమైన విచారణను ఎదుర్కొంటుండటం మనకు తెలిసిందే.ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి ఓటరు నమోదు డేటాలోనూ ఇలాంటి డబుల్ ఎంట్రీలు బయటపడటంతో.. "సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఏడాది కాలం జైలుశిక్ష పడే అవకాశం ఏమైనా ఉందా?" అంటూ నెటిజెన్లు, ప్రతిపక్షాలు ఆరా తీస్తున్నాయి. అత్యున్నత పదవిలో ఉన్న నేతలకు సంబంధించిన ఓటరు డేటాలోనే ఇలాంటి లోపాలు ఉండటం అధికారుల నిర్లక్ష్యమా లేక సాంకేతిక పొరపాటా అనే కోణంలో విశ్లేషణలు సాగుతున్నాయి. ఏది ఏమైనా, ఈ 'డబుల్ ఓటు' వ్యవహారం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి

- మొదటి పేజీ తరువాయి

'తెలంగాణ రైజింగ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం మంత్రులు, అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు నగరంలోని పరిశ్రమలను దశలవారీగా తరలిస్తామని, మెట్రో విస్తరణ చేపడతామని సీఎం వెల్లడించారు. డీజిల్ తో నడిచే ఆర్టీసీ బస్సులను నగరం వెలుపలికి తరలించి, వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి జీరో ట్యాక్స్ విధించే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి కాలుష్య రహితంగా మారుస్తామని, మెట్రో విస్తరణ, మూసీ పునరుద్ధరణ, పరిశ్రమల తరలింపుతో కూడిన ప్రాంతాన్ని 'కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)'గా అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో సేవల రంగానికి అనుగుణంగా పునర్నిర్మిస్తామని చెప్పారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు 10 కిలోమీటర్ల పరిధిని తయారీ పరిశ్రమల (మ్యాన్యుఫ్యాక్చరింగ్) జోన్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని రేవంత్ అన్నారు. వారికి ఎలాంటి నష్టం జరగకుండా తగిన పరిహారం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోతున్నారు..

- మొదటి పేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. ఈ పంటల కోసం అన్నదాతలకు తమ ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాన్ని ఇంకా నిర్ణయించలేదని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటమే తమ కర్తవ్యమని తెలిపారు. కంది, సోయాబీన్, పెసర, మినుము, జొన్న, సజ్జ సాగుకు రైతులు సిద్ధపడాలని సూచించారు. వర్షాల మీద ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సరికాదని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు, ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షపాతం తగ్గుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ...

- మొదటి పేజీ తరువాయి

దర్శించుకున్నారు. 30,939 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా, హుండీ ద్వారా రూ. 4.36 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. అదేవిధంగా, టీటీడీ రికార్డు స్థాయిలో 3.70 లక్షల లడ్డూలను విక్రయించింది. దాదాపు 2.99 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. వైద్య సేవలు పొందిన వారి సంఖ్య 3,928గా నమోదైంది. భక్తుల రద్దీ దృష్ట్యా, సర్వదర్శనం టోకెన్లు లేని వారు దర్శనానికి 15 నుంచి 18 గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అవసరమైన తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలను అందిస్తున్నట్లు తెలిపారు.

## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో గ్యాస్ సిలిండర్..

- మొదటి పేజీ తరువాయి

ఎల్పీజీ సిలిండర్ల పంపిణీని ప్రారంభించింది. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ సేవ ద్వారా ఆర్డర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సిలిండర్ వినియోగదారుడి ఇంటికి చేరుతుంది. తొలిదశలో భాగంగా బుధవారం బెంగళూరులో ఈ సేవలను ప్రారంభించారు.వినియోగదారులు ఇకపై స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ యాప్ ద్వారా నేరుగా గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవచ్చు. ఇందులో భాగంగా హెచ్‌పీసీఎల్‌కు చెందిన 10 కేజీల కంపోజిట్ సిలిండర్ (హెచ్‌పీ నవ్య)తో పాటు, 5 కేజీల సాధారణ మెటల్ సిలిండర్ అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా 'హెచ్‌పీ నవ్య' సిలిండర్ పారదర్శకంగా ఉండటం వల్ల గ్యాస్ స్థాయిని సులభంగా చూసుకోవచ్చు. అయితే, ఈ సేవను పొందేందుకు వినియోగదారులకు ముందే గ్యాస్ కనెక్షన్ ఉండాలన్న నిబంధన ఏమీ లేకపోవడం విశేషం.భద్రతా ప్రమాణాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, ఈ డెలివరీలను స్విగ్గీ సాధారణ సిబ్బంది కాకుండా హెచ్‌పీసీఎల్ అధీకృత డిస్ట్రిబ్యూటర్ల ద్వారా నిర్వహిస్తారు. తొలిసారి ఆర్డర్ ఇచ్చే వినియోగదారుల గుర్తింపు కార్డులను పరిశీలిస్తారు. ఆ తదుపరి ఆర్డర్ల నుంచి పాత సిలిండర్ ఇచ్చి కొత్తది తీసుకునే (ఎక్స్ఛేంజ్) విధానంలో డెలివరీ కొనసాగుతుంది. ఈ భాగస్వామ్యం ద్వారా నిత్యావసర సేవలను మరింత సులభతరం చేస్తున్నామని, భద్రత విషయంలో రాజీ పడబోమని ఇన్‌స్టామార్ట్ సీఈఓ అమితేష్ ఝా వెల్లడించారు. సాంప్రదాయ గ్యాస్ బుకింగ్ ప్రక్రియలో ఎదురయ్యే ఆలస్యాన్ని, ఇతర ఇబ్బందులను ఈ సేవ దూరం చేయనుంది. ప్రస్తుతానికి బెంగళూరులో మాత్రమే ప్రారంభమైన ఈ సేవను ఇతర నగరాలకు ఎప్పుడు విస్తరిస్తారనే విషయంపై సంస్థ ఇంకా స్పష్టత ఇవ్వలేదు.

## అభివృద్ధి కోసం కేంద్రాన్ని టార్గెట్ చేసిన సీఎం!

- మొదటి పేజీ తరువాయి

ముఖ్యమైనది. రాష్ట్ర అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, నిధులపై ఆధారపడి ఉండటంతో ఇలాంటి సమన్వయం అవసరం.ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వంటి బీజేపీ ఎంపీలు సమావేశానికి హాజరవడం సానుకూల అంశం. వారు పెండింగ్ ప్రాజెక్టుల అనుమతులు, నిధుల విడుదలపై దృష్టి పెట్టాలని కోరడం రాష్ట్ర సమస్యలపై ఉమ్మడి ఆందోళనను చూపిస్తుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరపడానికి ఒక మద్దతు వేదికగా మారవచ్చు. అయితే ఇది పూర్తి స్థాయి రాజకీయ సహకారం కాదని, నిర్దిష్ట అంశాలపై మాత్రమే సమన్వయం అని అర్థం చేసుకోవాలి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, అర్వింద్ వంటి ప్రముఖ బీజేపీ నాయకులు హాజరు కాకపోవడం ఈ వ్యూహానికి ఒక సవాల్ గా కనిపిస్తుంది. ఇది బీజేపీలో అంతర్గత వ్యూహాలు, వేరే ప్రాధాన్యతలు లేదా రాజకీయ ఒత్తిళ్లను సూచిస్తోంది. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు పూర్తి స్థాయి సహకారం ఇవ్వడం కష్టం కావడం సహజం. ఈ గైర్హాజరు రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు పూర్తి మద్దతు లభించకపోవచ్చని, లేదా బీజేపీ వైపు నుంచి వేరే విధానం అనుసరించే అవకాశం ఉంది.రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులు, నిధుల కోసం ప్రయత్నించడం ఈ వ్యూహంలో కీలక భాగం. రాష్ట్రాలు కేంద్ర నిధులు, అనుమతులపై ఎంతగా ఆధారపడి ఉంటాయో ఇది గుర్తు చేస్తుంది. ఈ ప్రయాణం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ భేదాలు పక్కన పెట్టి కేంద్రంతో సమన్వయం చేసుకునే ప్రయత్నం చేస్తోంది.రేవంత్ రెడ్డి ఈ వ్యూహం ద్వారా రాజకీయ పరిపక్వతను చూపించారు. రాష్ట్ర అభివృద్ధి అనేది ఒక్క పార్టీ సాధించగలిగేది కాదు. కేంద్ర-రాష్ట్ర సమన్వయం అవసరమైనప్పుడు ఇలాంటి చర్చలు ఉపయోగకరంగా ఉంటాయి. బీజేపీలోని కొందరు ఎంపీల హాజరు ఈ ప్రయత్నానికి కొంత మద్దతు ఇస్తుంది. రేవంత్ రెడ్డి వ్యూహం రాజకీయాల కంటే అభివృద్ధిని ముందుంచి చూస్తున్నట్లు కనిపిస్తోంది. దీని విజయం ఢిల్లీలో ఎంత మేరకు నిధులు, అనుమతులు సాధించగలుగుతారనే దానిపై ఆధారపడి ఉంటుంది.

## అద్దె వాహనాల డ్రైవర్ల ఆర్థిక ఇబ్బందులు..

**వేతనాల పెంపు కోరుతూ సమ్మె...**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలకు అద్దె ప్రాతిపదికన వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు, యజమానులు అమీర్ పేట్ హెచ్ఎండిఏ కార్యాలయం ముందు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం నెలకు రూ.34,000 చెల్లిస్తున్న అద్దెను పెంచి రూ.55,000కు పెంచాలని వారు డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, వాహనాల నిర్వహణ ఖర్చులు, ఈఎంఐలు, డ్రైవర్ల జీతాలు, బీమా ప్రీమియంలు తదితర వ్యయాలు గణనీయంగా పెరిగినా అద్దె చార్జీలను పెంచకపోవడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నామని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి అద్దె చార్జీలను రూ.34 వేల నుంచి రూ.55 వేలకు పెంచాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్, పండరి, సాయి, అబ్దుల్ ,హనుమంతు, వెంకటేష్, కరుణాకర్ ,నవీన్, ఆల్ హెచ్ఎండిఏ డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ నుండి యూ.కేకు బియ్యం ఎగుమతులు

**లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్**



**నిజామాబాద్, జూలై 15:** భారత్--యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా ఎగుమతులకు లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ నిజామాబాద్ నగరంలోని గజానన్ రైస్ మిల్ యాజమాన్యం యునైటెడ్ కింగ్‌డమ్‌కు బియ్యం ఎగుమతులకు అనుమతులు సాధించింది. ఈ మేరకు గజానన్ రైస్ మిల్లు నుండి యూ.కే కు ఎగుమతి అవుతున్న సోనా మసూరి ఎక్స్పోర్ట్ క్వాలిటీ బియ్యం నిల్వలతో కూడిన వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఈటీఏ అమలుతో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో నాణ్యమైన వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన నిజామాబాద్ జిల్లా నుంచి యూకేకు బియ్యం ఎగుమతులు ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన బియ్యాన్ని ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశాలకు కూడా జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేలా అధికారులు, ఎగుమతిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, గజానన్ రైస్ మిల్ ప్రతినిధి హితేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఓటుపై జోరుగా వార్తలు

**రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన**



**హైదరాబాద్::** సీఎం రేవంత్ రెడ్డిఓటుకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది. రేవంత్ రెడ్డి పేరు ఒకే ఎపిక్ నంబర్‌తో రెండు ఓటర్ జాబితాలలో కనిపించడం కేవలం సాంకేతిక లోపం మాత్రమేనని ఈసీ అధికారులు స్పష్టం చేసింది. ఈ మేరకు ఫ్యాక్ట్ చెక్ తెలంగాణ ఓ అధికారిక ప్రకటనను విడుదల చేసింది. అయితే, రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సార్ ప్రక్రియలో భాగంగా ఇలాంటి డూప్లికేట్ ఎంట్రీలను గుర్తించి, ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల మేరకు సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి డీఈవో ఈ సాంకేతిక లోపాన్ని సరిచేస్తారని స్పష్టం చేశారు. ఇక ఒకే ఎపిక్ నంబర్ రెండు వేర్వేరు ఓటరు జాబితాల్లో ఉన్నంత మాత్రాన..సదరు వ్యక్తికి రెండు నియోజకవర్గాల్లో ఓటు వేసే హక్కు లేదని ఎన్నికల క్లారిటీ ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఇలాంటి పొరపాట్లు కామన్ అని వాటన్నింటినీ త్వరలోనే జాబితా నుంచి తొలగిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేదు...

**మాజీమంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్**



**సికింద్రాబాద్:** ఎస్ఐఆర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేదని మాజీమంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ప్రత్యేక ఓటరు సవరణ లో 2002 సంవత్సరం వివరాలు ఎందుకని అయన ప్రశ్నించారు. బుధవారం నాడు అయన సనత్ నగర్ లోని సుభాష్ నగర్ లో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ ను సందర్శించారు. తలసాని మాట్లాడుతూ సిబ్బందిని సరిపడా నియమించలేదు. ఎన్యుమరేటర్ ఫారం లను నింపే విషయంలో కనీస అవగాహన లేని సిబ్బందిని నియమించారు. సర్వే పారదర్శకంగా, పూర్తిస్థాయిలో జరగాలంటే ఒక్కో బూత్ కు 4 బృందాలను ఏర్పాటు చేయాలి. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందిని నియమించాలని అన్నారు.

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్

**నిజామబాద్:** మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తలపెట్టిన నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్ఆరు. ఈ నేపథ్యంలో అయనను హౌస్ అరెస్టు చేసారు. నియోజకవర్గంలో ఉదయం నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ గృహనిర్బంధాలతో పాటు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. భీంగల్ మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఆర్టీసీ డిపో పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా నిరాహార దీక్ష చేయాలని ప్రశాంత్ రెడ్డి నిర్ణయించారు.

# కాంగ్రెస్ ను ముంచేస్తున్న అంతర్గత శత్రువులు...

**హైదరాబాద్, జూలై1 5:** కాంగ్రెస్ పార్టీకి శత్రువులు ఎక్కడో ఉండరని, ఆ పార్టీలోనే ఉంటారనేది రాజకీయాల్లో తరచూ వినిపించే మాట. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు ఈ వ్యాఖ్యలను అక్షరాలా నిజం చేస్తున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, అంతర్గత అసంతృప్తులు, బహిరంగ విమర్శలు కాంగ్రెస్ సర్కార్‌ను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. తాజాగా ఫైర్‌బ్రాండ్ నాయకురాలు, రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి, సీనియర్ నేత, ఎమ్మెల్సీ విజయశాంతి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. విపక్షాలకు ఆయుధాలు అందిస్తూ, సొంత ప్రభుత్వంపైనే వీరు గురిపెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ హైకమాండ్ ప్రతినిధి మీనాక్షి నటరాజన్‌తో ఎంపీ రేణుకా చౌదరి భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా తాజా రాజకీయాలపై వీరి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. అయితే ఈ భేటీ అనంతరం రేణుకా చౌదరి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ శ్రేణులను ఉలిక్కిపడేలా చేశాయి. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మళ్లీ పుంజుకుంటున్నాయని, కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికైనా మేలుకోవాలని ఆమె ఘాటుగా హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడ కాంగ్రెస్ నేతలు అసంతృప్తిగా ఉన్నారో ఆ విషయాన్ని బీజేపీ నేతలు పసిగడుతున్నారని, వారిని తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటన్నింటిపై



అధిష్ఠానంతో మాట్లాడతానని రేణుక స్పష్టం చేయడం ద్వారా.. పార్టీలో అంతా సజావుగా లేదనే సంకేతాన్ని ఆమె బహిరంగంగానే పంపించారు. మరోవైపు, సీనియర్ నేత విజయశాంతి సోషల్ మీడియా వేదికగా షాబాద్ నరమేధం ఉదంతాన్ని ప్రస్తావిస్తూ సొంత ప్రభుత్వంపై, పోలీస్ శాఖపై తీవ్ర విమర్శలు గుప్పించారు. షాబాద్ ఘోర కలికలిలో హంతకుడు ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులు ఈ కేసు ముగిసిందని భావించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో అసలు లోపాన్ని వేలెత్తి చూపుతూ.. పోక్సో కేసులో అరెస్ట్ అయిన నిందితుడు రాజ్ కుమార్ బెయిల్‌పై విడుదల కావడానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. నిందితుడి నుంచి లంచం తీసుకుని పోలీసులు అతడి విడుదలకు సహకరించారన్న వార్తలు పత్రికల ద్వారా తెలిసి తెలంగాణ మహిళా లోకం షాక్‌కు గురవుతోందని విజయశాంతి పేర్కొన్నారు. పోలీసుల చేసిన ఈ ఘోర తప్పిదం వల్లే, బయటకు వచ్చిన నిందితుడు ఏకంగా ఆరుగురి ప్రాణాలను కడతేర్చడానికి ఆస్కారం ఏర్పడిందని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్న కాంగ్రెస్ పాలనలో ఈ ఘటనను అత్యంత సీరియస్‌గా పరిగణించాలని ఆమె డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలోని ఇలాంటి అవినీతి, లోపాల వల్ల తెలంగాణలో మహిళా భద్రతపై అనుమానాలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఒక మహిళా ప్రజాప్రతినిధిగా శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ ఇద్దరు మహిళా నేతల వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమస్యలను వీధిలోకి తెచ్చాయి. ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను వెతకాల్సిన పనిలేకుండా, సొంత పార్టీ నేతలే లోపాలను ఎండగడుతుండటం కాంగ్రెస్ నాయకత్వానికి మింగుడుపడటం లేదు. శాంతిభద్రతల వైఫల్యం, నేతల్లో అసంతృప్తి, విపక్షాల బలం పెరుగుతుండటం వంటి అంశాలపై రేణుక, విజయశాంతి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి గొడ్డలిపెట్టులా మారాయి. అధికారంలో ఉండి కూడా సమన్వయం లోపించడం, అంతర్గత అసంతృప్తిని కప్పిపుచ్చుకోలేకపోవడం పార్టీని రక్షణలో పడేస్తోంది. ఈ సొంతింటి మంటలను కాంగ్రెస్ అధిష్ఠానం ఎలా చల్లారుస్తుందో చూడాలి.

# సగం మంది టీచర్లే టెట్ పాస్

**హైదరాబాద్, జూలై 15:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదలవగా.. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 43.94 శాతం మంది అభ్యర్థులు మాత్రమే అర్హత సాధించి తీవ్ర నిరాశపరిచారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ అధికారికంగా ఈ రిజల్ట్స్‌ను విడుదల చేయగా.. పరీక్ష రాసిన 1.15 లక్షల మందిలో సగం మంది కూడా క్వాలిఫై కాలేకపోయారు. ముఖ్యంగా ప్రస్తుతం విధుల్లో ఉంటూ పరీక్ష రాసిన ఇన్-సర్వీస్ ప్రభుత్వ ఉపాధ్యాయులలో ఏకంగా 14,814 మంది ఫెయిల్ కావడం విద్యాశాఖను దిగ్భ్రాంతికి గురిచేసింది. వీరంతా 2028 ఆగస్టు వరకు పాస్ కాకపోతే వీరి ఉద్యోగాలు పోయే అవకాశం ఉంది తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదల అయ్యాయి. ఈసారి ఫలితాల్లో అభ్యర్థులు తీవ్రంగా నిరాశపరిచారు. పరీక్ష రాసిన వారిలో సగం మంది కూడా క్వాలిఫై కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 43.94 శాతం మంది మాత్రమే అర్హత సాధించారు. హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో టెట్ కన్వీనర్ జి. రమేశ్, టెట్ డైరెక్టర్ రేవతిరెడ్డిలతో కలిసి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. మొత్తం 1,15,028 మంది పరీక్షకు హాజరుకాగా.. కేవలం 50,544 మంది మాత్రమే క్వాలిఫై అయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు అయితే సగం కంటే



తక్కువ మంది పాస్ కావడం గమనార్హం. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టుల కోసం నిర్వహించిన పేపర్-1 పరీక్షలో 65.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 36,129 మంది పరీక్ష రాయగా 23,590 మంది పాస్ అయ్యారు. అయితే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం నిర్వహించిన పేపర్-2లో ఫలితాలు చాలా ఘోరంగా ఉన్నాయి. పేపర్-2లో మొత్తం 78,899 మంది పరీక్ష రాస్తే కేవలం 26,954 మంది మాత్రమే అర్హత సాధించారు. ఇందులో మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగంలో 40.76 శాతం (17,987 మంది) ఉత్తీర్ణత సాధించగా.. సోషల్ స్టడీస్ విభాగంలో అత్యల్పంగా 25.79 శాతం (8,967 మంది) మంది మాత్రమే క్వాలిఫై కావడం గమనార్హం. మరోవైపు ప్రస్తుతం విధుల్లో ఉంటూ ఈ పరీక్ష రాసిన ఇన్-సర్వీస్ ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. మొత్తం 23,623 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పరీక్షకు హాజరుకాగా.. కేవలం 8,809 మంది (37.29%) మాత్రమే క్వాలిఫై అయ్యారు. ఏకంగా 14,814 మంది ఉపాధ్యాయులు ఫెయిల్ కావడం విద్యాశాఖ వర్గాలను విస్మయానికి గురిచేసింది. గతేడాది ప్రభుత్వ టీచర్ల పాస్ పర్సంటేజ్ 50 శాతంగా ఉండగా.. ఈసారి అది 37.29 శాతానికి పడిపోయింది. ఇన్-సర్వీస్ టీచర్లలో పేపర్-1లో 52.57 శాతం, పేపర్-2 మ్యాథ్స్ అండ్ సైన్స్‌లో 38.27 శాతం, సోషల్‌లో అత్యంత దారుణంగా 24.05 శాతం మంది మాత్రమే పాస్ అయ్యారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం.. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు 2028 ఆగస్టు నాటికి ఖచ్చితంగా టెట్ పరీక్ష పాస్ కావాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ డెడ్‌లైన్‌లోగా టెట్ క్వాలిఫై కాకపోతే వారు తమ ప్రభుత్వ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుంది. అయితే తాజా పరీక్షలో 14 వేల మందికి పైగా టీచర్లు ఫెయిల్ కావడంతో వారి ఉద్యోగ భద్రతపై తీవ్రమైన ఆందోళన నెలకొంది.

# కాజీపేటలో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ

**వరంగల్, జూలై 15:** తెలంగాణలోని కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నెక్స్ట్ జనరేషన్ ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ కేంద్రంగా అవతరించనుంది. రూ. 521 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. గంటకు 130 కిమీ వేగంతో దూసుకెళ్లే ఈ రైళ్లను 300 కిమీ పరిధిలోని నగరాల అనుసంధానానికి వాడనున్నారు. ఐదేళ్లలో 200 రైల్‌సెట్లను తయారు చేయాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఇక్కడ వందే భారత్ కోచ్‌ల తయారీకీ వీలుండగా.. ఈ ప్రాజెక్ట్ వల్ల రాష్ట్రంలో 3 వేల మందికి ఉపాధి లభించనుంది. ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు వంటి దేశంలోని ప్రధాన నగరాల మధ్య నడిచే నెక్స్ట్ జనరేషన్ అత్యాధునిక ఇంటర్‌సిటీ ప్యాసింజర్ రైళ్లు త్వరలోనే తెలంగాణ రాష్ట్రం నుంచి పట్టాలెక్కబోతున్నాయి. ఇందుకు సంబంధించి చారిత్రాత్మక రైల్వే ఉత్పాదక కేంద్రంగా మారేందుకు కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ సర్వసిద్ధమవుతోంది. కాజీపేట కర్మాగారంలో సరికొత్త ఇంటర్‌సిటీ కోచ్‌ల తయారీ కోసం చెన్నైకి చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ త్వరలోనే అంతర్జాతీయ టెండర్లను పిలవనుంది. దాదాపు రూ. 521 కోట్ల భారీ అంచనా వ్యయంతో అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమవుతున్న ఈ భారీ రైల్వే ఉత్పాదక కేంద్రం పనులు చివరి దశకు చేరుకున్నాయి. రానున్న కొద్ది నెలల్లోనే ఈ కర్మాగార నిర్మాణ పనులు పూర్తిగా పూర్తి కానున్నాయి. గరిష్ఠంగా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రూపొందించిన ఈ ఆధునిక రైళ్లను.. ప్రధానంగా 300 కిలోమీటర్ల లోపు ఉండే స్వల్ప, మధ్యస్థ దూర ప్రయాణాల కోసం ఉపయోగించనున్నారు. ఇవి పొరుగున ఉన్న పట్టణాలు, నగరాల మధ్య అత్యంత వేగవంతమైన, సౌకర్యవంతమైన కనెక్టివిటీని అందిస్తాయి. రాబోయే ఐదేళ్ల కాలంలో కాజీపేట కేంద్రంగా దాదాపు 200 ఇంటర్‌సిటీ రైల్‌సెట్లను తయారు చేయాలని భారతీయ రైల్వే శాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇక్కడ వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత.. తదుపరి తరం ప్రయాణికుల రోలింగ్ స్టాక్ తయారీలో ఈ తెలంగాణ



ఫ్యాక్టరీ దేశంలోనే అతిపెద్ద హబ్‌లలో ఒకటిగా అవతరించనుంది. కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో ఇప్పటికే 95 శాతం నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని, ఈ ఏడాది చివరి నాటికి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉందని దక్షిణ మధ్య రైల్వేఉన్నతాధికారులు తెలిపారు. అంతేకాకుండా.. ఈ కర్మాగారంలోనే వందే భారత్ కోచ్‌లతో పాటు అన్ని రకాల ఆధునిక ప్రయాణికుల రైళ్లను తయారు చేసేందుకు వీలుగా ఫ్లెక్సిబుల్ డిజైన్‌ను రూపొందించినట్లు ఆయన వివరించారు. రోజూ ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తల అవసరాలను తీర్చేలా, తక్కువ ఖర్చుతో కూడిన షటిల్ సర్వీసులుగా ఈ ట్రైన్లను రైల్వే శాఖ ప్రవేశపెట్టనుంది. ఈ రైళ్లలో ప్రయాణికుల కోసం అనేక రకాల అత్యాధునిక సదుపాయాలు కల్పించనున్నారు. ప్రతి రైలులో మొత్తం 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో ఆటోమేటిక్ ప్లగ్ డోర్లు, మెరుగైన వెంటిలేషన్ సిస్టమ్‌లు, ప్రమాదాల తీవ్రతను తట్టుకునేలా క్రాష్‌వర్తీ కోచ్ డిజైన్‌ను అమర్చనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి కోచ్‌కు ఇరువైపులా రెండేసి చొప్పున బయో-టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ కర్మాగారం ద్వారా స్థానికంగా దాదాపు 3 వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## హాస్టల్ విడిచి బయటకు వచ్చిన ఇంటర్ విద్యార్థులు

**మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా చెన్నూరులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో వసతుల సమస్యలతో 17 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంగళవారం రాత్రి హాస్టల్ విడిచి బయటకు వచ్చారు. ఎమ్మెల్యే సతీమణి సురేఖను కలిసి తమ ఇబ్బందులను వివరించారు. విద్యార్థుల సమస్యలను విన్న సురేఖ, వారిని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీధర్కు అప్పగించి, సురక్షితంగా చెన్నూరుకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. గురుకులంలో వసతులను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క కీలక సమీక్ష



**హైదరాబాద్, జులై 15:** మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క ఈరోజు(బుధవారం) సచివాలయంలో కీలక సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, పప్పు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. టేక్ హోమ్ రేషన్ ( పంపిణీలో వేగం పెంచాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, 3 నుంచి 6 ఏళ్ల చిన్నారుల హాజరును పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. పలు పథకాల కింద బడ్జెట్ విడుదల, వ్యయంపై జిల్లాల వారీగా పనితీరును పరిశీలించారు. అంగన్వాడీ 'తొలిముద్ద' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

## ప్రజలకు, విద్యార్థులకు, విలేఖరులకు

# ఆర్టీసీ వినమ్ర విజ్ఞప్తి

**జోగులాంబ గద్వాల, జూలై 15(స్కై న్యూస్):**ఆర్టీసీ అనేది ప్రజలందరికీ సేవ చేయడానికి పనిచేసే ప్రజా రవాణా సంస్థ. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడానికి డ్రైవర్లు, కండక్టర్లు ఎంతో ఓర్పుతో, బాధ్యతతో తమ విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికుల రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. ఒక్కో బస్సులో 100 నుండి 150 మంది వరకు ప్రయాణికులు ప్రయాణించే పరిస్థితులు ఉంటాయి. ఇలాంటి సమయంలో డ్రైవర్, కండక్టర్‌పై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. అయితే ఇటీవల కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా కళాశాల విద్యార్థుల వల్ల కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. బస్సులో లోపల ఖాళీ స్థలం ఉన్నప్పటికీ కొంతమంది విద్యార్థులు లోపలికి వెళ్లకుండా ఫుట్‌బోర్డుపైనే ప్రయాణించాలని పట్టుబడుతున్నారు. దీనివల్ల బస్సులో ఎక్కే, దిగే ఇతర ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో ప్రయాణించే కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోన్‌పాడు కళాశాల విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక ట్రిప్పులు నడుపుతున్నప్పటికీ, కొంతమంది ఆ బస్సులను ఉపయోగించకుండా రాయచూరు వైపు నుండి వచ్చే ప్రతి బస్సును ఆపడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో సాధారణ ప్రయాణికుల కోసం నడిచే బస్సుల్లో అనవసర రద్దీ ఏర్పడుతోంది. ఈ పరిస్థితిని డ్రైవర్ లేదా కండక్టర్ వివరించి, "మీ కళాశాల ప్రత్యేక బస్సుల్లోనే



ప్రయాణించండి" అని చెప్పినప్పుడు, కొందరు వెంటనే మొబైల్ ఫోన్లతో వీడియోలు తీసి అధికారులకు పంపిస్తామని బెదిరించడం కూడా జరుగుతోంది. దీంతో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సాయంత్రం సమయంలో వేలాది మంది విద్యార్థులను వారి ఇళ్లకు సురక్షితంగా పంపించేందుకు పై అధికారులు, డిపో సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు అందరూ కలిసి ఎంతో కష్టపడుతున్నారు. విద్యార్థులు కూడా సహకరిస్తే ఎలాంటి సమస్యలు తలెత్తవు. క్రమశిక్షణతో బస్సులో లోపలికి వెళ్లి ప్రయాణించడం, ప్రత్యేక ట్రిప్పులను వినియోగించడం ద్వారా అందరికీ సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించవచ్చు. అలాగే ఒక చిన్న సంఘటన జరిగిన వెంటనే పూర్తి వివరాలు తెలుసుకోకుండా, తప్పు ఎవరిదో నిర్ధారించకుండా మొత్తం బాధ్యతను డ్రైవర్, కండక్టర్లపై మోపడం సరైన విధానం కాదు. కొన్నిసార్లు విలేఖరులు కూడా అన్ని వాస్తవాలను తెలుసుకోకుండానే వార్తలు ప్రచురించడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడుతున్నాయి. ఆర్టీసీ సిబ్బంది ప్రతిరోజూ ఎదుర్కొనే ఒత్తిడి, బాధ్యత, కష్టనష్టాలు కూడా సమాజానికి తెలియజేయడం అవసరం. డ్రైవర్, కండక్టర్ ఉద్యోగం కేవలం టికెట్ ఇవ్వడం లేదా బస్సు నడపడం మాత్రమే కాదు. వందలాది మంది ప్రయాణికుల ప్రాణ భద్రత వారి చేతుల్లో ఉంటుంది. భారీ ట్రాఫిక్, రద్దీ, సమయపాలన, ప్రయాణికుల భద్రత వంటి అనేక బాధ్యతలను ఒకేసారి నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికులు, విద్యార్థులు, ప్రజలు, విలేఖరులు అందరూ పరస్పర సహకారం అందిస్తే ప్రజా రవాణా మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉంటుంది. అందువల్ల విద్యార్థులు ప్రత్యేకంగా తమ కోసం ఏర్పాటు చేసిన బస్సులను వినియోగించాలి. ఫుట్‌బోర్డు ప్రయాణానికి దూరంగా ఉండాలి. డ్రైవర్లు, కండక్టర్లతో మర్యాదగా వ్యవహరించాలి. అలాగే ప్రజలు, విలేఖరులు కూడా పూర్తి వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే స్పందించాలి. ఆర్టీసీ సిబ్బంది శత్రువులు కాదు... వారు ప్రజలకు సేవ చేసే సేవకులు. వారి కష్టాన్ని గుర్తించి అందరం సహకరిద్దాం. పరస్పర గౌరవం, సహనం, సహకారంతోనే సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది.

# గ్రామాల రీసర్వేకు లైసెన్స్ సర్వేయర్లు సహకరించాలి

**జోగులాంబ గద్వాల, జూలై 15 (స్కై న్యూస్):**ప్రభుత్వం గ్రామాల రీసర్వేకు జిల్లాలో మొదటి దశలో 70 గ్రామాలను ఎంపిక చేసిందని, లైసెన్స్ సర్వేయర్లు సహకరించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రీసర్వేకు సంబంధించి జిల్లాలోని లైసెన్స్ సర్వేయర్లతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల రీసర్వేకు నిర్ణయించినందున లైసెన్స్ పొందిన సర్వేయర్లకు పారితోషికం చెల్లించి సర్వే పనులు చేయించుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే పారితోషికం సరిపోదనే విమర్శలు చేయకుండా భవిష్యత్తులో లైసెన్స్ సర్వేయర్లకు మంచి అవకాశాలు వస్తాయనే ఆశావహ దృక్పథంతో ముందుకు



రావాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు లైసెన్స్ సర్వేయర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు సర్వేకు సంబంధించి శిక్షణ ఇచ్చి అర్హులైన వారందరికీ లైసెన్స్ సర్వేయర్లుగా గుర్తింపు ఇచ్చినప్పటికీ తమకు స్థిరమైన ఉపాధి, ఆదాయ అవకాశాలు ఇవ్వనందున ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. గ్రామాల రీసర్వేకు తమ సేవలందించాలంటే ప్రభుత్వం పారితోషికం పెంచాలని, టిఏ, డిఏ, తదితర అలవెన్స్ లు కల్పించాలన్నారు. లేదంటే ప్రతినెల కనీస వేతనంగా తమకు రూ.30000 చొప్పున చెల్లించాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్ల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో సర్వే ఏడి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పేదప్రజల సీఎం సహాయం నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల, జూలై 15(స్కై న్యూస్):** గద్వాల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల టౌన్, ధరూర్, గట్టు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధికి నమోదు చేసుకున్న వారికి సీఎం సహాయం నిధి ద్వారా మంజూరైన చెక్కులనుఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మాజీ ఎంపీటీసీ రాఘవేంద్ర రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో 67.36 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తి



**రంగారెడ్డి జిల్లా, జూలై 15 (స్కై న్యూస్)** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ 67.36 శాతం పూర్తయిందని ఆర్డీవో సరిత తెలిపారు. మొత్తం 2,44,426 మంది ఓటర్లలో 1,64,634 ఫారాలు డిజిటైజ్ చేయగా, 79,792 ఫారాలు (32.64 శాతం) ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. మండలాల వారీగా కొందుర్గు (80.39%), జిల్లేడ్ చౌదర్‌గూడెం (79.43%), ఫరూఖ్‌నగర్ రూరల్ (75.34%), కేశంపేట (74.78%) ముందంజలో ఉండగా, షాద్‌నగర్ మున్సిపాలిటీలో 40.95 శాతం మాత్రమే డిజిటైజేషన్ పూర్తైంది. పెండింగ్‌లో ఉన్న ఫారాల డిజిటైజేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు.

# దేవాలయానికి విరాళం

**జోగులాంబ గద్వాల, జూలై 15(స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం నందు గద్వాల పట్టణంలో నల్లకుంట శివాలయం గుడి పునర్నిర్మాణం రాతికటకంతో పూర్తి కావచ్చినది ఇట్టి నిర్మాణం కొరకు ఈరోజు విరాళం రాసిన దాత శివ నారాయణ శెట్టి.శ్రీ సీనియర్ అడ్డుకేట్ గారు 2.51.116. రెండు లక్షల 51 యొక్క వెయ్యి 116 రూపాయలు చందా రాసి నగదు. లక్ష రూపాయలు నగదు ఇచ్చినారు. చందా రాసిన పత్తి శివ నారాయణ అడ్వకేట్ కి .వారి కుటుంబ సభ్యులకు .ఆ శివుని కృప ఎల్లవేళలా ఉండాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా కోరుచు శివ నారాయణ గారికి వారి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తూ. ఈరోజు విరాళ సేకరణలో. శివాలయ కమిటీ చైర్మన్ పులిపాటి వెంకటేష్ కౌన్సిలర్ ఉపాధ్యక్షులు గుమ్మడం గోపాల్. కోశాధికారి శాసనూరు నాగరాజు శెట్టి ఈరోజు విరాల సేకరణలో పాల్గొనడం జరిగినది. గమనిక. ఆగస్టు నెలలో నల్లకుంట శివాలయం గుడి ప్రారంభోత్సవం ఉంటుంది. ఎవరైనా



భక్తులు చందా రాయని వారు ఉంటే .ఈ యొక్క నిర్మాణంలో ప్రారంభోత్సవం కార్యక్రమం కి కావలసిన డబ్బులు ఎవరైనా భక్తులు ఉంటే. నగదు రూపకంగా ఇవ్వదలచిన వారు ఈ నిర్మాణంలో మీరు కూడా భాగస్తులై ఆ శివుని కృప మీకు మీ కుటుంబ సభ్యులకుఎల్లవేళలా ఆ భగవంతుని ఆఫీసులో ఉండాలని. కోరుచున్నాము.

## ఘనంగా ప్రారంభమైన "రీబర్త్" మినీ మూవీ చిత్రీకరణ





**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సుందిళ్ల, జూలై 15, (స్కై న్యూస్):**ఆసవి **(ASAVI)** క్రియేషన్స్ బ్యానర్‌పై అశోక్ వేముల ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న "రీబర్త్" మినీ మూవీ చిత్రీకరణ బుధవారం (15-07-2026) సుందిళ్ల గ్రామంలోని స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రానికి కథ అశోక్ వేముల, స్క్రీన్ ప్లే మాటలు డైరెక్షన్ కొత్తూరు ప్రసాద్ చారి గారు అందిస్తున్నారు ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న గౌరవ సర్పంచ్ ముసుకుల నరేందర్ రెడ్డి గారు క్లాప్ కొట్టి చిత్రీకరణను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మంచి సందేశంతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆలోచింపజేసేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అశోక్ వేముల మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే విలువలు, మనిషి జీవితం పట్ల కొత్త దృక్పథాన్ని ప్రతిబింబించే కథాంశంతో "రీబర్త్" రూపొందుతోంది. ఈ కథలోని భావోద్వేగాలు, సస్పెన్స్, సందేశాత్మక అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా దర్శకుడు ప్రత్యేక శ్రద్ధతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో అమేజింగ్ స్టార్ అశోక వేముల మరియు జక్కిన శ్రీలత నేత ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతశీ వరికుప్పుల యాదగిరి గారు అందిస్తున్నారు ఛాయాగ్రాహకుడు గా (ఋశా): దేవా చిత్రీకరిస్తున్నారు, మేకప్ మెన్ అంజిబాబు సాహిత్యం వరికుప్పుల యాదగిరి , మూలశంకర్ కో-డైరెక్టర్ గా రతన్ కుమార్ ఉన్నారు ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ సత్యనారాయణ గౌడ్, ఉప సర్పంచ్ సదానందం, సదాశివ ఫౌండేషన్ బాధ్యులు శ్రావణ్ కుమార్, లింగమూర్తి, వాసు, సుధాకర్ రావు ప్రముఖ నటీనటులు, నిర్మాతలు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. చిత్రం మంచి విజయాన్ని అందుకోవాలని దీవించారు.

## ఉట్కూరులో వరుణుడి కరుణ కోసం సప్త భజనలు

**ఉట్కూర్ జులై 15( స్కై న్యూస)** సమద్రిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం కేంద్రంలోని దేవినగర్ కాళికామాత ఆలయంలో బుధవారం రైతులు. మహిళలు చిన్నారులు భక్తిశ్రద్ధలతో సప్త భజనలు ప్రారంభించారు. ఉపవాస



దీక్షలు చేపట్టి ఓం నమశివాయ నామస్మరణతో పత్రిక పూజలు నిర్వహిస్తూ వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ. వానకాలం ప్రారంభంలో ఆశాజనకంగా సాగు చేసిన పత్తి. కంది తదితర పంటలు తగ్గినంత వర్షపాతం లేక ఎండు ముఖం పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాలుచోట్ల పంటలు వాడిపోతూ ఉండటంతో రైతులు చాలా ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విస్తారంగా వర్షాలు కురిసి పంటలు కాపాడాలని రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సప్త భజనల్లో మహిళలు చిన్నారులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలు ఆలపించగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మో గాయి .

## ఉట్కూరులో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన....

**ఉట్కూర్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం సర్పంచ్ రేణుక భరత్**

**ఉట్కూరు జులై 15 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ ఎం. రేణుక భరత్. ఉప సర్పంచ్ రమేష్ తెలిపారు. బుధవారం నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల కేంద్రంలోని 10 వాడు



పాతపేటలో 15 వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పరిశుద్ధ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తున్నామని చెప్పారు. డేనీజి నిర్మాణంతో వర్షాపు నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు . గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేణుక భరత్. ఉప సర్పంచ్ రమేష్. ఎంపిటిసి హనుమంతు. పెద్దింటి లక్ష్మణ్. ముద్దం రాము. బెస్త రామచందర్. బిస్తా జగన్. మల్లెపల్లి తిరుపతి. మల్లెపల్లి అశోక్. కర్రే తిప్పన్నా. నరసింహ. శంకర్. సాకలి రణవీర్. మంగలి తరుణ్. వార్డు సభ్యులు గ్రామ పెద్దలు ప్రజా ప్రతినిధులు అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

## పేదల తిరుపతి శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న హైదరాబాద్ డి ఎస్ పి విక్రమ్ సింహారెడ్డి

**చిన్న చింతకుంట జూలై 15 (స్కై న్యూస్);** పేదల తిరుపతి శ్రీ కురుమూర్తి స్వామి దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో సప్తగిరి ల మధ్య స్వయంభుగా వెలసిన శ్రీ కురుమూర్తి స్వామిని బుధవారం హైదరాబాద్ డిఎస్పి విక్రమ్ సింహారెడ్డి తో పాటు అమ్మ ,అక్క తో స్వామి వారి దర్శనం కి రాగా ఆలయ సిబ్బంది ఆలయ పాలకవర్గ చైర్మన్ బత్తుల బాలరాజు, ఆలయ కార్య నిర్వహణ అధికారి మధునేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి స్వామి తీర్థ ప్రసాదంలు అందజేశారు. ఆలయ సాంప్రదాయ ప్రకారంగా



ఆలయ ప్రాంగణంలో డిఎస్పిని శాలువాలతో అర్చకులు ఘనంగా సన్మానించారు. స్వామి విశిష్టత గూర్చి డిఎస్పి అర్షకులను అడిగి తెలుసుకున్నారు.

## మోత్కులగూడలో రూ.1.71 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ

**రంగారెడ్డి జిల్లా, జూలై 15 (స్కై న్యూస్):** గ్రామీణ ప్రాంతాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం మోత్కులగూడలో రూ.1.71 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు.



డీఎంఎఫ్‌టీఎఫ్ నిధులతో డ్రైనేజీ పనులు, మోత్కులగూడ--కేసారం గ్రామాల మధ్య రూ.1.60 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉమ్రయాత్రకు వెళుతున్న వారిని సన్మానించిన బిఆర్ఎస్ నేత మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ

**ఆత్మకూర్ జులై 15( స్కై న్యూస్)** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో 9వ వార్డు వాల్మీకి నగర్ కు చెందిన మెకానిక్ బషీర్ గారి పెద్ద కుమారుడు సమీర్ బాంబే టైలర్ సలాం గారి కుమారుడు ఇలియాస్ ఉమ్రాయాత్రకు వెళు తున్న శుభసందర్భంగా వారి నివాసానికి వచ్చి ఘనంగా శాలువాతో సన్మానించి మిఠాయి



తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మండ్ల రామకృష్ణ గారు మరియు శుబా కార్యక్రమంలోవెంకటేష్ రఘు పురేందర్ పాషా తదితర వ్యక్తులు పాల్గొన్నారు

# చెత్తకుప్పల్లో కాదు.. 'ఊయల'లో ఉంచండి

**కలెక్టర్ ప్రియాంక**




**నారాయణపేట జూలై 15 (స్కైన్యూస్:)**అనివార్య పరిస్థితుల్లో నవజాత శిశువులను రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, చెత్తకుప్పలు వంటి ప్రాంతా ల్లో వదిలివేయకుండా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన లిలి'ఊయల' లిలిలో సురక్షితంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ప్రజలకు విజ్ఞప్తి చేశారు.నారాయణపేట ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఊయల శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూవదిలివేయబడిన శిశువుల ప్రాణాలను కాపాడి వారికి భద్రమైన సంరక్షణ కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఒకవైపు కొంత మంది నవజాత శిశువు లను అనాథలుగా వదిలి వేస్తుండగా, మరోవైపు సంతానం లేని దంపతులు సి ఏ ఆర్.డి.నిబంధనల ప్రకారం చట్టబద్ధ దత్తత కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ రెండు అంశాలను దృష్టిలో ఉంచుకుని శిశువును పెంచుకునే అవకాశం లేని తల్లిదండ్రులు ఎలాంటి భయం, సంకోచం లేకుండా 'ఊయల'లో వదిలి వెళ్లాలని సూచించారు.ఊయలలో ఉంచిన శిశువులను మహిళా, శిశు సంక్షేమ శాఖ పూర్తి బాధ్యతతో సంరక్షించి, అమల్లో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుని అర్హులైన దత్తత తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇచ్చే ప్రక్రియను నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్య క్రమం ద్వారా నవజాత శిశువుల ప్రాణాలను కాపాడడంతో పాటు వారికి మంచి భవిష్యత్తు కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో మెడికల్ కాలేజీ సూపర్ఇంటెండెంట్ సంపత్ కుమార్ సింగ్, డిప్యూటీ సూపరింటెం డెంట్ డాక్టర్ ఆదిత్య, డిఎంహెచ్వో జయచంద్ర మోహన్, డిసిపిఓ కరిష్మా, ప్రొఫెసర్లు సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను విజయవంతం చేయాలి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా, జూలై 15 (స్కై న్యూస్):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12, 13, 14 వార్డులు, బూత్ నెంబర్లు 227, 228, 231, 234లను సందర్శించి సర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడిన ఎమ్మెల్యే, ఎన్యూమరేషన్ ఫారాల నమోదు, వివరాల పరిశీలనపై ఆరా తీశారు. ప్రతి అర్హుడైన ఓటరు సర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని అధికారులకు, బీఎల్వోలకు ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులు నూతన సాంకేతిక పద్ధతులు పాటించాలి

**కలెక్టర్**



**నారాయణపేట జూలై 15: (స్కైన్యూస్)**రైతులు నూతన సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు.కొస్గి మండలం మల్లారెడ్డిపల్లి రైతు వేదిక ముషీఫా లో జిల్లా కలెక్టర్ బుధవారం క్షేత్ర పర్యటన -- పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన, "ప్రాజెక్ట్ కె-100"కు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సంద ర్భంగా రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తున్న మల్చింగ్ విధానంలో వంకాయ, పచ్చిమిర్చి సాగు, స్టేకింగ్ విధానంలో టమాట సాగు, అలాగే పూల సాగు (ఫ్లోరికల్చర్) పొలాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.రైతులు అవలంబిస్తున్న ఆధునిక సాగు విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పంటల నిర్వహణ తీరు పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. వినూత్న వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగుతున్న రైతులను అభినందించి, ఇతర రైతులు కూడా ఇలాంటి ఆధునిక సాంకేతికతలను స్వీకరించాలని సూచించారు. అనంతరం ఎల్నినో పరిస్థితులలో ప్రత్యామ్నాయ పంటలు, కరువును తట్టుకునే రకాలు, స్వల్పకాలిక రకాలు సాగు చెయ్యాలని సూచించారు మరియు వర్షపు నీటిని ఆదా చేసుకోవడానికి ఫారం పాండ్స్ తవ్వుకోవాలని సూచించారు.అనంతరం నిర్వహించిన "ప్రాజెక్ట్ కె-100" ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నారాయణపేట సక్రియా నాయక్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు, కూరగాయలు, పూల సాగు వంటి పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు.రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, స్థిరమైన వ్యవసాయాభివృద్ధికి "ప్రాజెక్ట్ కె- 100" ఎంతో దోహదపడుతుందని పేర్కొంటూ, ఈ ప్రాజెక్టు విజయవంతమైన అమలుకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎల్ నినో దృష్టిలో పెట్టుకుని వేయాల్సిన పంటలపై అవగాహన కల్పించాలన్నారు. పంటల సాగు పై రైతులకు అవసరమైన డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. తాను కూడా రైతు కుటుంబం నుండే వచ్చానని గతంలో పండే పంటలు నేడు పండించలేకపోతున్నారని అన్నారు.అలాగే ఈ కార్యక్రమంలో కూరగాయల విత్తనాలు, పత్తి విత్తనాలు రైతులకు అందచేశారు.ఈ కార్యక్రమంలో వార్ల విజయ్ కుమార్ గ్రంథాలయ చైర్మన్ రఘువర్ధన్ రెడ్డి ఏ డీ ఏ రామ కృష్ణ , తహసీల్దార్ శ్రీనివాసులు , ఎంపిడిఓ శ్రీధర్ , హార్టికల్చర్ అధికారి హర్ష వర్ధన్ రెడ్డి , కొస్గి డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు (ఎం ఏ ఓ లు) రేష్మ రెడ్డి , రమేష్ , ప్రవీణ్ కుమార్ , వ్యవసాయ విస్తరణ అధికారులు , ఉద్యాన శాఖ అధికారులు మరియు సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్స్, రైతు సోదరులు పాల్గొన్నారు.అలాగే కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమల్ మండలాలకు చెందిన సుమారు 120 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని పంటల వైవిధ్యీకరణ, ఆధునిక సాగు పద్ధతులు మరియు ప్రాజెక్ట్ కే 100 ద్వారా లభించే ప్రయోజనాలపై అవగాహన పొందారు.

### పాల్వంచ పట్టణాన్ని అన్ని రంగాల్లో

# సమగ్రంగా అభివృద్ధి చేస్తాం...

**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందస్తు ప్రణాళికతో ముందడుగు.**
**మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం.**
**రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి.**
**నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తా.**
**రూ.1.73 కోట్లతో 10 రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం.**
**కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు.**





**పాల్వంచ జూలై 15( స్కై న్యూస్)::** పాల్వంచ పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ పట్టణంలో బుధవారం రూ.1.73 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్లు, ఇతర అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శంకుస్థాపనల సభల్లో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 31, 33, 34, 36, 38, 42, 45 డివిజన్లలో ఈ నిధులతో మొత్తం 10 అభివృద్ధి, నిర్మాణ పనులను ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు వివరించారు. ప్రజలకు అత్యంత అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, అందులో భాగంగానే ఈ నిధులను మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. పట్టణంలో మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరిచేందుకు డ్రైన్ల నిర్మాణంతో పాటు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు సిమెంట్ రోడ్లను నిర్మిస్తామన్నారు. ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా ఈ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపక్షం నిలిచే ఎమ్మెల్యేగా నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, పాల్వంచ పట్టణ రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేషన్ కమిషనర్ కె సుజాత, తహసిల్దార్ దారా ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏ డి ఈ అబ్దుల్ రెహమాన్, డిప్యూటీ కమిషనర్ విజయానంద్, టౌన్ ఎస్సై తోట నాగరాజు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, నూనావత్ శ్యామల, గొర్లె అన్నపూర్ణ, సింధు తపస్వి, సుగుణ, నరేష్, మధుచంద్, విజయలక్ష్మి, సీపీఐ నాయకులు శనగారపు శ్రీనివాసరావు, గౌతమి కృష్ణ, శేఖర్ బాబు, ఎం గిరి, నాగమణి, ఎస్కే రెహమాన్, ఆలపాటి ప్రసాద్, కరీం, కాకటి రవీందర్, దినేష్, నరేష్, నవీన్, అంజాద్, రామాచారి, బట్టు హరి, చరప శ్రీను, లక్ష్మీ, రాజేశ్వరరావు, జిలానీ, భీమనాయక్, ఆదినారాయణ, అశోక్, వివిధ శాఖల డిఇలు, ఏఈలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవాది పై దాడికి

# నిరసనగా కోర్టు వీధుల బహిష్కరణ

**ఎస్పీ నీ కలిసిన న్యాయవాదులు**



**నారాయణపేట జూలై 15: (స్కైన్యూస్):**న్యాయవాది ఉండేకొడ్ నీరజ్ పై దాడికి నిరసనగా బుధవారం నారాయణపేట జిల్లా కోర్టులో న్యాయవాదు లు కోర్టు విధులను బహిష్క రించారు.నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు, ఈ విషయంలో బాధితునికి సహకరించక నిర్లక్ష్యం వహించిన పోలీస్ అధికారులుసంబంధిత ఎస్సై సీఐలను సస్పెండ్ చేయాలని జిల్లా ఎస్పీని కలిసిన నారాయణపేట న్యాయవాదులు కోరారు.తన పట్టా భూమి పై సాగు చేసుకుంటున్న న్యాయవా ది నీరజ్ పై పక్క పట్టాదా రులు విచక్షణ రైతంగా లాఠీలతో కర్రలతో దాడి చేసి గాయపరిచిన వ్యక్తు లపై నామమాత్రపు కేసు వేసి వారి వైపే మద్దతు ఇస్తున్న సంబంధిత ఎస్ఐ సీఐలను సస్పెండ్ చేయాల ని న్యాయవాదిని తీవ్రంగా గాయపరిచి వారిపై హత్యాయత్నం చేసిన నిందితులపై బి ఎన్ ఎస్ హత్యాయత్నం కేసును చేయాలని నారాయణపేట న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో దామోదర్ గౌడ్ అధ్యక్షతన తమ విధులను బహిష్కరించి కోర్టు నుండి ఎస్పీ ఆఫీసు వరకు పాదయాత్రగా బయ లుదేరి వారికి చట్టపరమైన చర్యల గురించి ఎస్పి కి వినతి పత్రాన్ని నారాయ ణపేట న్యాయవాదులు సమర్పించారు. ఈ విష యంలో బాధితునికి బాధిత న్యాయవాదికి పూర్తి న్యాయం జరిగే విధంగా ఎలాంటి పక్షపాతం లేకుండా నిర్ణయాలు ఉంటా యని నారాయణపేట న్యాయవాదులకు జిల్లా ఎస్పీ డాక్టర్ జి వినీత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం న్యాయవాది రఘువీర్ యాదవ్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం చెన్నారెడ్డి కార్యదర్శి అమీరుద్దీన్, న్యాయవాదులు కురుమన్న గౌడ్ నరసింహులు యాదవ్ టి రామచంద్రయ్య, ప్రవీణ్ కుమార్ నామాజీ, వినోద్ ఆడెం శ్రీనివాస్, దత్తాత్రేయ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంలో న్యాయవాదికి పూర్తి న్యాయం చేసే వరకు నారాయణపేట తో సహా ఉమ్మడి పాలమూరు జిల్లా న్యాయవాద సంఘాలన్నీ మద్దతు తెలిపాలని నారాయణపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ కోరినారు. ఈరోజు జిల్లా ఎస్పీ ఇచ్చిన హామీ మేరకు వారు తీసు కొనే తదుపరి చర్యలు అనంతరము న్యాయవాద సంఘాలు తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలీ

**బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి రంగప్ప**



**నారాయణపేట జూలై 15: (స్కైన్యూస్)** అగ్రవర్ణ దురహంకారంతో దుర్భాషలాడిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి నీ బర్తరఫ్ చేసి వెంటనే అరెస్ట్ చేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి రంగప్ప యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నారాయణ పేట జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు, 82 ఏళ్ల బీసీ యాదవ మహిళ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసిన అనుచిత, కుల అహంకా రపూరిత వ్యాఖ్యలను బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఫ్లెక్సీలో తన తండ్రి ఫోటో లేదనే కారణంతో ఈశ్వరమ్మ యాదవ్ ని శివచరణ్ రెడ్డి దూషించడంపై మాట్లాడు తూ కుల అహంకారంతో మాట్లాడిన శివచరణ్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని, ప్రాథమిక సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్టానం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిం చారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా గౌరవించి బోర్డు సభ్యురా లిగా నియమిస్తే,దాన్ని ఓర్చుకోలేక ఒక వర్గం ఆధిపత్య ధోరణి ప్రదర్శి స్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ లకు పదవు లు వస్తే రెడ్డి నాయకులు ఎందుకు ఓర్చుకోలేక పోతున్నారు? కాంగ్రెస్ పార్టీ కేవలం రెడ్డిల పార్టీయా? బీసీలకు విలువ లేదా? బీసీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకు లు ప్రశ్నించారు. శివచరణ్ రెడ్డి వెంటనే బహిరంగంగా ఈశ్వరమ్మ యాదవ్ కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కొత్తూరులో టిప్పర్ ఢీకొని కారు ధ్వంసం..

**తృటిలో తప్పిన ప్రమాదం**



**రంగారెడ్డి జిల్లా, జూలై 15 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ వై జంక్షన్ బైపాస్ రోడ్డుపై హైదరాబాద్కు వెళు తున్న కారును వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఢీకొన్న ప్రభావంతో కారు డివైడర్ వైపు దూసుకెళ్లగా, కారులో ఉన్న ఇద్దరు కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్, కొత్తూరు పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై స్పందించిన కొత్తూరు సీఐ, భారీ లోడుతో అతివేగంగా ప్రయాణించే టిప్పర్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్లు వేగ పరిమితులు పాటించి రోడ్డు భద్రతకు సహకరించాలని సూచించారు.

### ఉట్కూరు మండలంలో

# ముమ్మారంగా ఎస్ఐఆర్ నమోదు

**సర్ నమోదు కార్యక్రమంలో బిజీబిజీగా అధికారులు**



**ఉట్కూర్ జూలై 15 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూరు లో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలో కొనసాగుతుంది. బుధవారం ముట్కూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఎం. రేణుక భరత్. కొల్లూరు గ్రామ సర్పంచ్ సింగారం సువర్ణ శ్రీనివాస్. ఆధ్వర్యంలో బి ఎల్ వోలు బి ఎల్ ఏ లతో కలిసి నమోదు ప్రక్రియని నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ అశోక్ కుమార్ మాట్లాడుతూ. ఈనెల 24వ తేదీలోగా అర్హులైన ప్రతి ఒక్క ఓటర్లు ఎస్ ఐ ఆర్ నమోదు ప్రతియను పూర్తి చేసుకోవాలని. అవసరమైన పత్రాలను సంబంధిత బిఎల్ఓ లకు అందించి ఎన్నికల జాబితాలో తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేణుక భరత్. కొల్లూరు సర్పంచ్ సింగారం సువర్ణ శ్రీనివాస్. తాసిల్దార్ అశోక్ కుమార్. డిప్యూటీ తాసిల్దార్ చింతా రవి. సీనియర్ అసిస్టెంట్ రాఘవేందర్ రెడ్డి. ఆర్ ఐ లు కృష్ణారెడ్డి. వెంకటేష్. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన...

## ప్రజల సమస్యలను నేరుగా విని త్వరి తగతిన పరిష్కరిస్తా మని ఎస్పీ హామీ

**నారాయణపేట జూలై 15: (స్నైన్యూస్)**నారాయణపేట జిల్లా ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో నిర్వహించిన "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి మొత్తం 25 ఫోన్ కాల్స్ అందినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.బుధవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా లోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు, ఫిర్యాదుదారులు నేరుగా జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు.ప్రజలు ప్రధానంగా గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టడం, బెల్ట్ షాపులను మూసి వేయడం, భూ తగాదాలు, ట్రాఫిక్ సమస్యలు, అక్రమ మద్యం విక్రయాలు, పాన్ షాపుల్లో గుట్కాల విక్రయాలు, రాత్రి వేళల్లో మద్యం సేవించి గొడవలు చేయడం, ఎస్ఐ ఫిర్యాదు స్వీకరించలేదనే ఆరోపణ లు, కానిస్టేబుల్ భూ వివాదాల్లో జోక్యం చేసుకో వడం, పెండింగ్ దొంగత నాల కేసుల దర్యాప్తు, ఓపెన్ డ్రింకింగ్, రాత్రి పెట్రోలింగ్ పెంచడం, చీటింగ్ కేసులు వంటి అంశాలపై ఫిర్యాదులు చేశారు.అలాగే మరికల్ మండలం తిలేరు గేట్ వద్ద ప్రజల భద్రత కోసం బ్యారి కేడ్లు ఏర్పాటు చేయాలని, రేడియం స్టిక్కర్లు అమర్చా



లని విజ్ఞప్తి చేశారు. నారా యణపేట పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్, యాద్గిరి రోడ్, సరాఫ్ బజార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఉట్కూర్ లో కొంతమంది రౌడీ షీటర్లు, కమ్యూనల్ షీటర్ల జాబితాలో ప్రమే యం లేని అమాయకుల పేర్లు ఉన్నాయనే ఫిర్యా దుపై స్పందించిన జిల్లా ఎస్పీ, సమగ్ర విచారణ నిర్వహించి అర్హులైన వారి పేర్లను జాబితా నుంచి తొలగించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మక్తల్‌లో కారు మిస్సింగ్ కేసు, వెండి ఆభరణాల చోరీ కేసు, మద్దూరులో బెల్ట్ షాపులు, ఓపెన్ డ్రింకింగ్, గొర్రెల చోరీ కేసులు, భూ వివాదాలకు సంబంధించిన పలు ఫిర్యాదులు కూడా అందా యి. ఈ సందర్భంగా ఒక వ్యక్తి ఫోన్ ద్వారా స్పంది స్తూ, "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమం ఎంతో ఉపయోగకరమైందని, ఇలాంటి ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలను నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కు జిల్లా ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడు తూప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వయం గా నమోదు చేసి సంబం ధిత పోలీస్ అధికారులకు వెంటనే పంపించామని తెలిపారు. ప్రతి సమస్యను నిష్పక్షపాతంగా విచారించి త్వరితగతిన పరిష్కరించే లా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి నట్లు చెప్పారు.ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి న్యాయం చేసేందుకు కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఇలాంటి "డయల్ యువర్ఎస్పీ" కార్యక్ర మాలను తరచుగా నిర్వ హించి ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్య లను నేరుగా పోలీస్ ఉన్న తాధికారుల దృష్టికి తీసుకు రావాలని ఆయన ఆకాంక్షిం చారు.

# ఆషాడం మాసం ప్రారంభం

## ఆషాడం మాసం జులై 15 బుధవారం నాడు ప్రారంభమై ఆగస్టు 12 బుధవారం వరకు ఆషాడ అమావాస్య కొనసాగుతుంది

**ఆత్మకూరు జులై 15( స్కై న్యూస్)** పూర్వాషాడ నక్షత్రంలో కూడిన పౌర్ణమి ఉన్న నెల ఆషాడ మాసం సంవత్సరంలో నాలుగవ మాసం దీన్ని శూన్య మాసం మనీ కూడా అంటారు వర్షపు రుతువు కూడా ఈ ఈమాసంలోనే ప్రారంభం అవుతుంది పౌర్ణమినాడు చంద్రుడు ఉత్తరాషాడ పూర్వాషాడ నక్షత్రాల సమీపంలోనే వచ్చేనెల ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి సూర్యుడు మిథున రాశి నుంచి కర్కాట రాశిలోకి దాంతో దక్షిణాయనం మొదలవుతుంది నాడు విష్ణువు పాలకడలిపై యోగ నిద్రలోకి వెళ్లి సందర్భాన్ని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు ఆషాడం శుద్ధ పౌర్ణమి రోజున గురు పౌర్ణమి గా వ్యవహరిస్తారు ఆషాడం మాసంలోనే దక్షిణాయనం మొదలవుతుంది...కర్కటంలోనికి సూర్యుడు ప్రవేశించడం తోనే దక్షిణాన ఆరంభం అవుతుందిసూర్యుడు రాశిలో ప్రవేశించినప్పటికీ నుంచి తిరిగి మకర రాశిలోకి ప్రవేశించే వరకు దక్షిణాయనం అంటారు సూర్యుడు భూమధ్యరేఖకు దక్షిణంగా సంచరిస్తాడు దక్షిణాయనం పితృదేవతలకు ప్రీతికరమని కూడా చెప్పబడింది వేదం ప్రకారం చూసిన అన్నం బహుపూర్విత అంటుంది వ్యవసాయదారునికి కృషికి అండగా భగవంతుని అనుగ్రహం తోడై వర్షరూపంగా ఎక్కువ పరిణామం ధ్యానం పండి ఎవరికి జనులను ఆకలి బాధ లేకుండా ఉండాలని పరమార్థం ఈ మాసంలో నే త్రిమూర్తి స్వరూపుడైన గురువుని ఆరాధించే పర్వదినం గురుపూర్ణిమ కూడా దీనినే వ్యాస పూర్ణిమణి కూడా అంటారు ఆషాడశుద్ధ విద్య నాడు పూరి జగన్నాథ బలభద్ర సుభద్ర రథయాత్ర కన్నుల పండుగగా జరుపుతారు ఆషాడశు ద్ధ పంచమి స్కందపంచమిగా చెప్తారు సుబ్రహ్మణ్యస్వామిని ఈరోజు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు ఆషాడ షష్టిని కుమార సృష్టిగా జరుపుకుంటారు ఆషాడశుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి అని శయన ఏకాదశి అని కూడా అంటారు ఈ రోజు నుంచి చెత్తరాత్మ వ్రతం మొదలవుతుంది దీనినే మంత్ర త్రయ ఏకాదశి అంటారుఆషాడ మాసంలోనే తెలంగాణ ప్రాంతంలో సంప్రదాయబద్ధమైన బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు మహంకాళి అమ్మవారి కోసం తయారు చేసే భోజనాన్ని బోనం గా చెప్తారు దీనిని అమ్మవారికి నైవేద్యంగా చేసి పర్వదినానే బోనాలు బయలుదేరుతాయి అమ్మవారికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ పండుగ అత్యంత వైభవంగా జరుపుకుంటారు సమస్య జగత్తు కారణమైనటువంటి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు అన్నం ,బెల్లం,పసుపు నీళ్ల వేపాకులు బోనంలో పెట్టుకొని అమ్మవారికి పూజ చేసిన తర్వాత ఒక్కపొద్దుగా విడిచి తదుపరి పనిని మొదలు పెడతారు ఇక వ్యవసాయం పనులన్నీ ఈ మాసంలోనే రైతుల ప్రారంభిస్తారు చైత్ర వైశాఖ మాసాలలో వ్యవసాయపు పనులను ఉండవు కాబట్టి ఈ సమయంలోనే వివాహాది శుభ ముహూర్తాలు ఎక్కువగాఉండవుఆషాడం అయిపోయిన తర్వాత శ్రావణమాసంలో పెళ్లిళ్ల సీజను వేరే ఇతర ముహూర్తాలు కూడా మంచి దినాలుగా ప్రకటిస్తారు పురోహితులు ఈ రోజుల్లో కొత్తగా పెళ్లయిన అబ్బాయిఅమ్మాయి ఒక నెల వరకు ఇద్దరినీ కలవనీయకుండా కొత్తగా అయిన పెళ్లిలో పెళ్లికూతురులను ఒక నెల వరకు ఇంటికి తోలుకొచ్చుకుంటారు అమ్మాయి అత్తగారింట్లో ఉండే సంప్రదాయం ఉండేది కష్టపడి వేసే పనులు చేయవలసిన యువకులు అత్తవారింట్లో కూర్చుని ఉంటే సకాలంలో జరగవలసిన పనులు జరగవు వర్షం తగ్గట్టువిత్తనాలు



చల్లుకునే రోజులు అవి వాటిలాగా కాలువల ద్వారా నీరు లభించేది కాదు సరైన సమయంలో విత్తనాలు వెళ్ళకపోతే సంవత్సరం అంతా దరిద్రంతో బాధపడవలసి వస్తుందేమో అని కొత్త గావచన కోడల్నిఅత్తవారింట్లో వదిలిపెట్టి రావడం తాతమ్మ తాతల కెళ్ళి ఆచారంగా భావిస్తున్న మన తెలుగు ప్రజలు ఆ శుభ సమయంలోనూఅనారోగ్య మాసం ఆషాడ మాసం కొత్తగా నీరు తాగడం వల్ల చలి జ్వరాలు విరోచనాలు తలనొప్పి మొదలైన వ్యాధులు వచ్చే సమయం స్త్రీలకు గర్భం జరుగుతే ఉత్తమ సంతానం కలగగానే నమ్మకం కూడా ఉంది అన్ని కారణాలవల్ల ఆషాడం మాసాన్ని కొన్ని పనులకు నిషేధం చేస్తారు మన పెద్దలు

# ప్రత్యేక తనిఖీలు 36 కేసులు రూ.7 510 జరిమానా

## నంబర్ ప్లేట్లు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్ల వాహనాలపై ప్రత్యేక డ్రైవ్

**కొత్తగూడెం జూలై 15( స్కై న్యూస్):** పట్టణంలో నంబర్ ప్లేట్ నిబంధనల ఉల్లంఘనులపై పోలీసుల ప్రత్యేక తనిఖీలు.రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఉదయం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలే లక్ష్యంగా ఈ డ్రైవ్ కొనసాగింది. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిబంధనలను ఉల్లంఘించిన మొత్తం 36 వాహనాలపై పోలీసులు కేసులు నమోదు చేసి, రూ. 7,510/- జరిమానా విధించి వసూలు చేశారు.ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వాహన యజమానులు అందరూ తమ వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నంబర్ ప్లేట్లను వక్రీకరించడం, అంకెలను



మార్చడం లేదా స్పష్టంగా కనిపించకుండా చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని, ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను



తప్పనిసరిగా పాటించాలని కోరారు. పట్టణంలో రోడ్డు భద్రతను పటిష్టం చేయడానికి ఇటువంటి డ్రైవ్ లు నిరంతరం చేపడుతామని పోలీసులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తిప్రాస్ పల్లి గ్రామంలో చట్టాలపై అవగాహనా..

## - చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్

**నారాయణపేట జూలై 15 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉట్కూర్ మండలం తిప్రాస్ పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ అవగాహన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని భూసార పరీక్షల వల్ల నేలలో ఏ పోషకాలు ఉన్నాయో తెలుసుకుని అదే ఎరువు వాడితే దిగుబడి పెరుగుతింది అని, ఖర్చు కూడా తగ్గుతుంది అని, ఎరువులు, విత్తనాలు కొనేటప్పుడు బిల్లు తీసుకోవాలి ఏమైనా సమస్య వస్తే బిల్లు ఆధారంగా ఫిర్యాదు చేయడానికి ఉపయోగపడుతుంది అని సూచించారు. ఈ సందర్భంగా నల్సా ఆధ్వర్యంలో అమలవుతున్న అన్ని పథకాల మీద అవగాహన కలిపించారు. బాలల న్యాయ సేవల పథకం, మానసిక



వైకల్యుల న్యాయ పథకం, వృద్ధుల న్యాయ సహాయ పథకం, పేద పిల్లల విద్యా పథకం, మహిళల రక్షణ పథకం, ఖైదీల పునరావాస పథకం, వ్యసనాల నుండి విముక్తి పథకం, మహిళల అవగాహన పథకం, హక్కులు-విధుల అవగాహన, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పోక్సో చట్టం గురించి,



1098 చైల్డ్ హెల్ప్‌లైన్ మరియు డ్రగ్స్ తీసుకోవడం వల్ల జరిగే అనర్థాల మరియు పలు చట్టాల మీద అవగాహన కలిపించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 గురించి వివరించారు. ఈ శిబిరంలో ఏ.ఈ.ఓ ప్రశాంతి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పేట జిల్లాను కరవు ప్రాంతంగా ప్రకటించాలి

## టి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



**నారాయణపేట జూలై 15: (స్కైన్యూస్)** ఎల్నినో కారణంగా వర్షాలు కురియక నారాయణపేట జిల్లాలో పంటలు ఎండిపోయాయని రైతులను ఆదుకోవడం కోసం జిల్లాను కరవు ప్రాంతంగా ప్రకటించాలనీ టి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు గావినోళ్ల శ్రీనివాస్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం బాపన్‌పల్లి గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో తగినంత వర్షపాతం లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికిరాక తీవ్ర నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, జిల్లా వ్యాప్తంగా పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాలపై వడ్డీ మినహాయింపు, అవసరమైన ఇతర సహాయ చర్యలు వెంటనే చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని, రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కొత్తూరులో అగ్నిప్రమాదం..

## ప్లంబింగ్ గోదాం దగ్ధం



**రంగారెడ్డి జిల్లా, జూలై 15 (స్కై న్యూస్):** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో ప్లంబింగ్ గోదాం పూర్తిగా దగ్ధమైంది. బాబూలాల్ గోదాం వద్ద ఉన్న గడ్డివాముకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని, పక్కనే ఉన్న ఓం ప్రకాష్‌కు చెందిన ప్లంబింగ్ గోదాంకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల సహకారంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ప్లాస్టిక్ పైపులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.5 లక్షల మేర నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రజల ఆరోగ్యం తో చెలగాటం ఆడుతున్న చుంచుపల్లి గ్రామ పంచాయతీ



**చుచుపల్లి జూలై 15 (స్కై న్యూస్ ):**బాబుక్యాంప్ వైకుంఠ ధామం లో ప్రతినిత్యం చుంచుపల్లి పంచాయతీ చుట్టు పక్కల సెకరించిన చెత్తను తగలబెడుతున్నారు.ముందే పోలిస్ స్టేషన్ ఉంది, పక్కనే సియం పి యస్ ఆఫీస్, పక్కన ఒక పాఠశాల, ఐటిఐ, గొదుమ వాగు పక్కన వందాలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వ్యర్థాలు తగలబెట్టడం వల్ల వెదజల్లే కాలుష్యం దుర్వాసన మూలంగా విద్యార్థులకు కళ్ళ మంటలు, శ్వాసకోస సమస్యలు వస్తున్నాయి.కలెక్టర్ , కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్ పంచాయతీ సెక్రటరీ , కాలుష్య నివారణ యంత్రణ అధికారులు దయచేసి వ్యర్థాలు తగల బెట్టకుండా మా ఆరోగ్యాలు కాపాడమని పత్రిక ముఖంగా విన్నపం చేస్తున్నాము.

# మొగిలిగిద్దలో ఇందిరమ్మ ఇంటికి టేస్టీ రెస్టారెంట్ చేయూత



**రంగారెడ్డి జిల్లా, జూలై 15 (స్కై న్యూస్):** మొగిలిగిద్ద గ్రామంలో హోటల్ టేస్టీ రెస్టారెంట్ యాజమాన్యం తమ వద్ద పనిచేస్తున్న కార్మికుడు మున్నూరు శేఖర్‌కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.1 లక్ష సొంత నిధులతో స్లాబ్ వేయించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పేదలకు అండగా నిలుస్తున్న టేస్టీ రెస్టారెంట్ యాజమాన్యాన్ని, 5వ వార్డు సభ్యుడు ఠాకూర్ అమృత్ సాగర్, కోట్ల రవిని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**రంగారెడ్డి జిల్లా, జూలై 15 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పించి సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ 12వ వార్డులో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కమిషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ దిలీప్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## లైసెన్స్ పొందిన సర్వేయర్లకు వేతనం పెంపు మరియు ఉద్యోగ భద్రత కల్పించవలెనని వినతి



**జోగులాంబ గద్వాల, జూలై 15(స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల్ జిల్లా రెవెన్యూ లైసెన్స్ సర్వేయుర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ధనపు కలెక్టర్ మధుమోహన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వము నిర్దేశించిన శిక్షణ మరియు అర్హతలు పూర్తి చేసి లైసెన్స్ పొందినప్పటికీ, ప్రస్తుతం మాకు తగిన పని అవకాశాలు మరియు స్థిరమైన ఆదాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనీ ప్రస్తుతం అప్పగించే సర్వే పనుల ద్వారానే జీవనోపాధి పొందుతున్నాము.ప్రస్తుతం ఒక్క ఎకరానికి ?50/- మాత్రమే వేతనం నిర్ణయించబడింది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణ ఖర్చులు, ఫీల్డ్ ఖర్చులు, సాంకేతిక సమస్యలు, జీవన వ్యయాలు పెరిగిన నెలోదిందో ఈ వేతనం సరిపోవడం లేదు. అందువల్ల మా పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని క్రింది డిమాండ్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవలసిందిగా వినమ్రంగా మనవి చేస్తున్నాము.

**మా డిమాండ్లు:**

1. ప్రతి నేల సర్వేకు కనీస ఫీజుగా ?30,000/- వేతనం నిర్ణయించాలి.
2. ఫీల్డ్ డ్యూటీలో ప్రమాద బీమా మరియు అరోగ్య బీమా కల్పించాలి.
3. టి ఏ డి ఏ మరియు ప్రయాణ భత్యాలు మంజూరు చేయాలి.
4. టెక్నికల్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక హెల్సెస్ ఏర్పాటు చేయాలి.
5. లైసెన్స్ సర్వేయర్లకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు మరియు భద్రత కల్పించాలి.
6. భవిష్యత్తులో లైసెన్స్ సర్వేయర్లకు స్థిరమైన ఉద్యోగ భద్రత కల్పించాలి.

కాబట్టి మా న్యాయమైన డిమాండ్లను దయచేసి పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వ రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోరారు.

## జూరాలప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులకుసాగునీటి విడుదల వెంటనే చేయాలి

**బిజెపి మాజీ మండల అధ్యక్షుడు పి విష్ణువర్ధన్ రెడ్డి**



**ఆత్మకూరు జూలై 15(స్కై న్యూస్)** ములమల శివారులో సూపర్ కెనల్ కింద కొంతమంది రైతులు నాటు వేసుకుంటున్నారు సూపర్ కెనాల్ నీటిని పూర్తిగా బంద్ చేయడంతో వరి చేనులంతా నీరు లేక ఏండు ముఖం పడుతున్నాయి రైతులకు నష్టం ఎవరు భరిస్తారని అధికారుల మీద బిజెపి మాజీ మండల అధ్యక్షుడు మండిపడ్డాడు రైతు గోసను మంత్రి గారు అర్థం చేసుకొని అధికారులకు చేరవాణి ధార సమాచారం అందించి వెంటనే ఆయకట్టు కింద వాటర్ వదలాలని కోరడమైనది లేని పక్షంలో రైతులంతా కలిసి సమ్మె ఉదృతం చేయవలసి వస్తుందని హెచ్చరిస్తూ మాజీ మండల అధ్యక్షుడు పి విష్ణువర్ధన్ రెడ్డి ఆయన తెలిపారు

## వైఎం తండాలో డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ ఏర్పాటు



**రంగారెడ్డి జిల్లా, జూలై 15 (స్కై న్యూస్):** సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకిస్తూ వైఎం తండాలో లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా మిట్టు నాయక్, ఉపాధ్యక్షులుగా రాంచందర్ నాయక్, రుప్ల నాయక్, ప్రధాన కార్యదర్శిగా బిచ్య నాయక్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ మాట్లాడుతూ జీవో 641ను రద్దు చేసి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ రద్దయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.




## విద్యార్థులకు స్కూల్ షూస్ పంపిణీ



**దేవరకద్ర, అమరచింత జూలై 15 (స్కై న్యూస్);** అమరచింత పట్టణంలోని దేశాయి మురళీధర్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దేశాయి మురళీధర్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు రెండు జతల స్కూల్ షూ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మమ్మ దేశాయి ప్రకాష్ రెడ్డి సేవా సమితి అధ్యక్షులు సయ్యద్ కలాం పాషా పాఠశాల ఉపాధ్యాయులు శ్రీలత సుధా హరిత మాసూమ్ బి జ్యోతి బాలమణి షకీలా బేగం సుహాని సిద్దికు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకేనా దైవభీతి?

నేటి సమాజంలో కొందరి దృష్టిలో, కొన్ని చోట్ల వ్యాపారానికి పెద్ద కేంద్రంగా భక్తి మారింది. కొత్త ఆలయ నిర్మాణమంటే భక్తులు, పాలకమండళ్ల ప్రతినిధులు, పాలకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. ఆలయం ఎంత పెద్ద స్థలంలో, ఎన్ని అంతస్తుల్లో కడుతున్నారన్నదే ప్రధాన అంశం అవుతున్నది. దేశంలో ఓ కొత్త గుడి కట్టగానే 'మీరు చూశారా? చూసొచ్చారా?' అనే చర్చ మొదలవుతున్నది. భక్తుల తాకిడి, హుండీ రాబడి పెరుగడంతో ఆలయ నిర్వాహకుల్లో ధన పిశాచి రెక్కలు విప్పుకొంటున్నది. దేవుడంటే భయభక్తులు ఉన్నవారు దర్శనాలతో తరిస్తుంటే, అస్సలు భయం లేనివారి దారి మరోలా ఉన్నది. చిన్న దొంగ తాను దొంగనని ఒప్పుకొంటాడు. పెద్ద దొంగ మాత్రం మహాభక్తుడిగా వేషం కట్టి, సంప్రదాయ పద్ధతులు పాటించి, అవకాశం చిక్కగానే బందిపోటుగా మారుతాడు. సాధారణ జనం నమ్మకం, ధనవంతుల పాపపరిహారం గుడులను బతికిస్తున్నాయి. గుడి ఆదాయాన్ని బట్టి నిర్వాహకుల ఆదాయం కూడా పెరుగుతుంది. ఆధునిక హిందూ దేవాలయ నిర్మాణాల్లో అయోధ్య రామాలయం సర్వోన్నతమైనది. ఈ ఆలయం పూర్తికావడానికి ఏడాది ఉండగానే భక్తుల రద్దీ పెరిగింది. అంత గొప్ప పేరున్న రామమందిరం ఈ మధ్య ఊహించని రీతిలో ఇంటి దొంగల బారిన పడి ఎంతోమంది పరువును గంగలో కలిపింది. భక్తిపారవశ్యంలో వరదలా వచ్చిన రామమందిర నిర్మాణ సొమ్ముకు లెక్కే లేకుండా పోయింది. ఆ ధనరాశుల ముందు నిర్వాహకుల భక్తి, నిష్ఠలు తేలిపోయాయి. దేవుడికిచ్చిన సొమ్ము గురించి భక్తులు లెక్కలు అడుగుతారా? అనే ధీమాతో తోచినంత దోచుకున్నారు. 2021లో ఈ ఆలయం కోసం సింధీ సమాజం ఇచ్చిన రూ.రెండు కోట్ల విలువైన వెండి ఇటుకలకు ఇంకా రసీదు అందలేదు. కానీ నకిలీ రసీదు పుస్తకాలు ముద్రణ అయ్యాయి. సీసీ టీవీల కంటపడకుండా నోట్ల సంచులు రోజుల తరబడి రవాణా అయ్యాయి. ఇదంతా తాత్కాలిక ఉద్యోగుల నిర్వాకమైనా..? పెద్దల అండ లేనిదే ఇదంతా సాధ్యం కాదు. 'ఇంత బరితెగిస్తారా?' అని ప్రజలు దిగ్భ్రాంతి చెందుతున్నారు. గుడి నిర్మాణాన్ని ప్రతిష్టగా తీసుకొన్న బీజేపీ పెద్దలు



కంగుతిన్నారు. ప్రజల ముందు ముఖం చాటేయలేక యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. సీఎం ఎన్ని సర్దుబాటు మాటలు మాట్లాడినా దోపిడీని కాదనలేని పరిస్థితి. ఇది బహిరంగ రహస్యమే కానీ, నోరు విప్పలేని అవస్థ. 'ఈ హుండీ దొంగల కేసులను ఎట్టిపరిస్థితిల్లోనూ వాదించబోం' అంటూ ఫైజాబాద్ న్యాయవాదుల సంఘం తేల్చిచెప్పింది. ఒకవేళ ఎవరైనా వాదించడానికి ముందుకు వస్తే వారికి రూ.5 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. జాతీయ ప్రసార మాధ్యమాలు, పత్రికల్లో రామాలయంలో జరిగిన భారీ దోపిడీపై విమర్శనాత్మక చర్చ జరుగుతున్నది. ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ, ఎద్దేవా చేస్తూ ఎన్నో రకాల కార్టూన్లు వస్తున్నాయి. ఆయా కార్టూన్ల ప్రభావం సామాన్య పాఠకులపై తప్పకుండా ఉంటుంది. ఇంత జరిగినా దుష్టశిక్షణ చేయాలని బాల రాముడికి అనిపించడం లేదా? అని సామాన్య భక్తులు ప్రశ్నిస్తున్నారు. అయోధ్య రామాలయంలో నిధులు స్వాహా అయ్యాయని తెలియగానే భక్తుల సంఖ్య, హుండీ ఆదాయం తగ్గాయనే వార్తలు వస్తున్నాయి. దేవుడనేవాడు ఈ విగ్రహాల్లో ఉంటాడా? పూజలు, యాగాలు ఆయన కోరుకుంటాడా? కానుకలు సమర్పిస్తే కోరికలు తీర్చుతాడా? అనే అనుమానాలు రాకుండా ఇంతకాలం గడిచింది. ఇప్పటివరకైతే అన్నీ దేవుడే చూసుకుంటాడు, వారి కర్మ వారే అనుభవిస్తారని దొంగలను వదిలేసే దయాగుణం భక్తులకు ఉన్నది. ఇంత భారీగా ఆలయ సొమ్ము కాజేసిన దొంగలకు తగిన శిక్ష పడుతుందన్న నమ్మకాన్ని కేంద్రం, యూపీ ప్రభుత్వం కలిగించాలి. రామ జన్మభూమిలో ఆలయ నిర్మాణ ఘనత తమదేనని చెప్పుకొనే బీజేపీ, గుడి పేరుతో రాజకీయంగా లబ్ధి పొందిన బీజేపీ, ఇప్పుడు ఎందుకు స్పందించదు? రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నప్పుడు మౌనం వహించడం ఎంతవరకు సమంజసం?

# ఈసీ కొత్త మెలిక!

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పేరిట దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో ఇప్పటికే దాదాపు అయిదున్నర కోట్లమంది ఓటర్లను జాబితాల్లోంచి తొలగించి రికార్డు సృష్టించిన ఎన్నికల సంఘం(ఈసీ)... కొత్త రికార్డులు నెలకొల్పాలని తహతహలాడుతున్నట్టు కన బడుతోంది. 2002 నాటి ఓటర్ల జాబితాలో గల తమ తల్లిదండ్రుల వివరాలు పొందుపరి స్తేనే కొత్తగా 18 యేళ్లు నిండినవారూ, ఓటుహక్కు పొందదల్చుకున్న ఇతరులూ అర్హులవు తారని విధించిన తాజా నిబంధన ప్రకంపనలు రేపుతోంది. బిహార్‌తో మొదలెట్టి ఇంత వరకూ వివిధ రాష్ట్రాల్లో జరిగిన 'సర్'లో లేని నిబంధన ఇప్పుడు కొత్తగా అందరి నెత్తినా పడేసింది. 2002 నాటికే తల్లిదండ్రులు మరణించివున్నా... అప్పట్లో సమయానికి ఇంట్లో లేకపోవటంవల్లనో, పనిపాటల కోసం వేరే ప్రాంతంలో ఉండటంవల్లనో వారి ఓటు హక్కు గల్లంతైవుంటే అలాంటి వాళ్ల పరిస్థితేమిటో చెప్పాలన్న స్పృహ కూడా దానికి లేకుండా పోయింది. అలాంటివాళ్లు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చనటం తప్ప మరేమీ వివరణ లేదు! తీరా ఇస్తే ఈ నిబంధన సాకుతో తిరస్కరించటం తప్ప ఒరిగేదేముంటుంది? ఒకరి తర్వాత ఒకరుగా వచ్చిన పాలకుల పుణ్యమా అని ఈ దేశంలో ఇతర చీడలతో పాటు నిరక్షరాస్యత కూడా నిక్షేపంగా ఉంది. 2011 నాటి లెక్కల ప్రకారం అక్షరాస్యత 74.04 శాతం. ఇప్పుడు జాతీయ సగటు 81 శాతమని అంటున్నారు. సంతకం పెట్టగలి గినపాటి జ్ఞానం వచ్చినవారిని అక్షరాస్యులుగా లెక్కేయటంవల్ల ఈమాత్రం కనబడుతోంది. తేలిగ్గా దేన్నయినా చదవగలిగేవారెందరో చెప్పలేం. అలాంటివారు ఇరవైయ్యేళ్ల క్రితం తమ ఓటు ఎక్కడుందో గుర్తుపెట్టుకుని పాత చిట్టాలు వెతకగలరా? ఒకవేళ గుర్తున్నా 2008 పునర్విభజనలో చాలా నియోజకవర్గాల పేర్లు, వాటి పరిధిలోని ఊళ్లు మారాయి గనుక వాస్తవంగా తమ ఓటు ఏ పరిధిలోకి పోయిందో తెలుసుకోలేరు. పైగా ఇది సాగు సీజన్. నాట్లు, యూరియా కొనుగోలు, ఇతరేతర పనుల కోసం రైతులు ఇప్పటికే తిప్పలు పడుతున్నారు. వారి పిల్లలు సైతం ఆ పనులు పంచుకుంటే తప్ప ఒక కొలిక్కి రాదు. జనాన్ని బాధించటానికి ఇంతకన్నా మంచి అదును ఈసీకి దొరకలేనట్టుంది! ఈసీ తీసుకొచ్చిన ఈ 'సర్' రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు చెప్పివుండొచ్చు. అందులో




చోటు దొరకనివారు ట్రిబ్యునళ్లను ఆశ్రయించవచ్చన్న వెసులుబాటు కల్పించి వుండొచ్చు. కానీ అది నిగ్గుతేలేసరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. బెంగాల్ సంగతే తీసుకుంటే జాబితాల్లో గల్లంతైనవారు లక్షల్లో ఉండగా... ట్రిబ్యునళ్లు తేల్చిన కేసులు మూడు, నాలుగు వేలు మించలేదు. ఇలాగైతే అంతా తేలేసరికి కనీసం పాతికేళ్లు పడుతుందని న్యాయ నిపుణులు లెక్కేస్తున్నారు. 'సర్'లో చోటు దొరక్కపోతే పింఛన్లు మొదలు కొని గ్యాస్ సిలెండర్ల సబ్సిడీ వరకూ సమస్తం ఆపేయటం కొన్ని రాష్ట్రాల్లో మొదలైంది. రేపో మాపో మీరు ఈ దేశ పౌరులు కాదు... ఇక్కడ ఉండటానికి అనర్హులని చెప్పినా ఆశ్చర్యం లేదు. పోనీ ఈసీ 'స్వచ్ఛమైన' జాబితాను రూపొందించగలుగుతోందా? పరకాల ప్రభాకర్ వంటి సామాజికవేత్తలు చెబుతున్నదాన్నిబట్టి చూస్తే యూపీలో కొన్ని చిరునామాల్లో వందలమంది ఓటర్లు నమోదైవున్నారు. ఇలాంటి ఆరోపణలకు ఈసీ వివరణ ఇచ్చిన దాఖలా లేదు. అసలు అలాంటి బాధ్యత ఉన్నట్టు కూడా అది గుర్తించే స్థితిలో లేదు. ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల టీడీపీ కార్యాలయాల్లో, ఆ పార్టీ నేతల ఇళ్లలో 'సర్' దరఖాస్తులు ఎవరికి ఇవ్వాలి... ఎవరికి ఇవ్వకూడదన్న నిర్ణయాలు జరుగుతున్నా యని వైఎస్సార్ కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మీడియాలో ఫొటోలు, వీడియోలు వస్తున్నాయి. అయినా ఈసీ ఉలకదు, పలకదు. సంబంధిత బీఎల్‌ఓలపై చర్యలుండవు. ఈ తంతు గమనిస్తే ఇది 'తీసివేతల ఈసీ'గా కనబడుతోంది. గతంలో ఓటర్ల జాబితా సవరణలో కొత్తగా ఇన్ని లక్షలమంది జమ అయ్యారని... అందులో మొదటిసారి ఓటుహక్కు వచ్చినవారు ఇంతమంది అని ఈసీ గర్వంగా చెప్పుకునేది. ఇప్పుడు తీసివేతలే గర్వకారణంగా మారింది. ప్రపంచంలోనే అన్నీ డిజిటల్ చేశామని గొప్పగా చెప్పుకునే దేశంలో కాగితాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే స్థితి కల్పించిన ఘనత ఈసీది. మొత్తానికి ఆ సంస్థ మస్తిష్కంలో రేపటి రోజున ఎలాంటి ఆలోచనలు పుడతాయో, ఏం అమల్లోకొస్తుందో అని జనం భయపడే రోజులొచ్చాయి.

## పసిమొగ్గపై లైంగిక దాడి

**బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.!పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆరేళ్ల చిన్నారి ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్ళింది. స్కూల్ ముగిసిన తర్వాత తల్లి ఆమెను ఇంటికి తీసుకురావడానికి వెళ్లినప్పుడు, ఆ చిన్నారి తీవ్ర భయాందోళనలతో కలత చెంది కనిపించింది. ఇంటికి వచ్చిన తర్వాత భయపడుతూనే పాఠశాలలో జరిగిన ఘోరాన్ని తల్లిదండ్రులకు వివరించింది. తాను టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ తలుపు లోపల గడియ పెట్టి, బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పింది. ఆ సమయంలో నిందితుడి స్నేహితుడు వచ్చి బయటి నుండి తలుపు తట్టడంతో నిందితుడు చిన్నారిని వదిలేశాడు. లేకపోతే ఊపిరాడక స్పృహ కోల్పోయే స్థితికి ఆ చిన్నారి చేరుకుండేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.ఈ దారుణంపై చిన్నారి తల్లిదండ్రులు వెంటనే పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. అయితే, బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రిన్సిపాల్.. నిందితుడిని సమర్థించే ప్రయత్నం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పాఠశాల పరువు పోతుందని బెదిరిస్తూ, వారిని కూడా ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్లక్ష్యపూరిత చర్యపై ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. స్కూల్ ఎదుట ఆందోళన తీవ్రం కావడంతో చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది.బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, తక్షణమే అతడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పాపియా సుల్తానా స్పందిస్తూ.. బాధితురాలి వయసు, సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని మరిన్ని వివరాలను గోప్యంగా ఉంచుతున్నామని, తక్షణమే కఠిన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మరోవైపు, నిందితుడిని కాపాడటానికి ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని, బాధితులను హేళన చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన తోటి ఉపాధ్యాయులను కూడా సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది..

# ఇసుక, కంకర (గ్రావెల్) అక్రమ తవ్వకాలు, రవాణా పై కఠిన చర్యలు

**అనుమతి పొందిన ప్రతి వాహనానికి విండ్‌స్క్రీన్‌పై పర్మిట్ తప్పనిసరి**

**అక్రమాలకు పాల్పడితే రీచ్‌ల అనుమతులు రద్దు చేస్తాం**

**జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**

**రెవెన్యూ, మైనింగ్ శాఖలతో సమన్వయంతో సంయుక్త దాడులు**

**జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు**



**తిరుపతి, జూలై 15:**జిల్లాలో ఇసుక, కంకర (గ్రావెల్) అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ మిని కాన్ఫిరెన్స్ హాలు నందు రెవెన్యూ, మైనింగ్, పోలీస్, రవాణా, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో ఇసుక, కంకర తవ్వకాల నియంత్రణ, అనుమతులు, రవాణా, పర్యవేక్షణ, అమలు చర్యలపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు సంయుక్తంగా సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేని ప్రాంతాల్లో ఇసుక, కంకర తవ్వకాలు, అక్రమ నిల్వలు, అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే తవ్వకాలు, రవాణా జరిగేలా క్షేత్రస్థాయిలో పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలన్నారు. అనుమతులు పొందిన ఇసుక రీచ్‌లు, క్వారీల నుంచి ఖనిజాలను తరలించే ప్రతి వాహనానికి సంబంధిత అనుమతి పత్రాన్ని (పర్మిట్) విండ్ స్క్రీన్‌పై తప్పనిసరిగా ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనాల నమోదు సంఖ్యలతో కూడిన పూర్తి జాబితాను రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు అందజేయాలని సూచించారు. ప్రతి వాహనం ఆన్‌లైన్ బిల్లు, అనుమతి పత్రాలతోనే రవాణా చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్, రవాణా శాఖలు పరస్పర సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అనుమతులు లేని వాహనాలు, అక్రమ తవ్వకాలపై తక్షణమే కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పునరావృతం కాకుండా సమర్థవంతమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు సంయుక్త టాస్క్‌ఫోర్స్‌గా పనిచేసి అందిన ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టులు, కీలక రహదారుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంతో పాటు ఇతర జలవనరుల వద్ద అనుమతించిన హద్దులను దాటి ఇసుక తవ్వకాలు జరగకుండా నీటిపారుదల, రెవెన్యూ శాఖలు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన రీచ్‌లు, వాహనాలపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి పొందిన రీచ్‌కు చెందిన వాహనం అక్రమ రవాణాలో పట్టుబడితే సంబంధిత రీచ్ అనుమతిని రద్దు చేయడంతో పాటు అవసరమైతే తాత్కాలికంగా సస్పెండ్ చేసే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక ప్రజల గృహ నిర్మాణ అవసరాల కోసం ప్రభుత్వ నిబంధనల మేరకు జరిగే చిన్నస్థాయి ఇసుక రవాణాకు ఇబ్బందులు కలిగించవద్దని, అయితే పెద్ద ఎత్తున అక్రమ నిల్వలు, డంపింగ్ చేసి టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు మాట్లాడుతూ అక్రమ ఇసుక, కంకర రవాణా పై జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖలతో సమన్వయం చేసుకుని సంయుక్త దాడులు నిర్వహిస్తామని తెలిపారు. అక్రమ రవాణా, తవ్వకాలలో పాల్గొనే వ్యక్తులు, వాహనాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎటువంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిబంధనలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లాలో ఇసుక, కంకర అవసరాలు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు సరఫరా, జాతీయ రహదారుల నిర్మాణ పనులకు అవసరమైన ఖనిజాల లభ్యత, అనుమతుల ప్రక్రియ, అక్రమ తవ్వకాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, శాఖల వారీగా బాధ్యతలు, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థపై సవివరంగా చర్చించారు. ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాశ్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, జిల్లా రవాణా అధికారి మురళీ మోహన్, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీ నాయక్, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్లు (తిరుపతి, చిత్తూరు నెల్లూరు, చెన్నై), నీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్ ను లైట్ తీసుకుంటే ఓటు గల్లంతే...

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**కరీంనగర్:**సర్ అనేది రాజకీయ కార్యక్రమం కాదు ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమం ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధం.ఓటే లేకపోతే మీ ప్రశ్నకు ప్రజాస్వామ్య బలం ఎక్కడిది ఆ ఏముందిలే అని నిర్లక్ష్యం చేస్తే ఓటును కోల్పోతారు.యువకులారా సర్ ప్రక్రియలో పాల్గొనండి.మీ కుటుంబ సభ్యుల ఓట్లు పోకుండా చూడండి. బీఎల్ఓ వద్దకు వెల్లి ఫారమ్ ను అందజేసిన కేంద్ర మంత్రి.సర్ ప్రకియ పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్.కరీంనగర్ లో బండి సంజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా తప్పనిసరిగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ సర్ ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సర్ ను లైట్ తీసుకుంటే మీ ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉంది అని హెచ్చరించారు. సర్ ప్రక్రియను ఎవరూ లైట్ తీసుకోవద్దని కోరారు. మీ ఓటును కాపాడుకోండి మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి’అని పిలుపునిచ్చారు.

# పంటల బీమా ఇవ్వకుండా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టొద్దు....

**2024--25 పంటల బీమా నిధులను వెంటనే విడుదల చేయాలి**

**తుగ్గలి:**2024--25 సంవత్సరానికి సంబంధించిన పంటల బీమా నిధులను తక్షణమే విడుదల చేసి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం రోజున తుగ్గలి వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మీ నారాయణ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు దెబ్బతిని ఏడాది గడుస్తున్నా బీమా సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.వరుసగా ఎదురైన పంట నష్టాలతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రైతులకు భరోసా కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వం,పరిహారం చెల్లించే సమయంలో మాత్రం చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. వ్యవసాయమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని చెప్పే పాలకులు, అదే రైతు కష్టాల్లో ఉన్నప్పుడు స్పందించకపోవడం బాధాకరమన్నారు.విత్తనాలు, ఎరువులు,పురుగుమందుల ధరలు భారీగా పెరగడంతో సాగు వ్యయం రెట్టింపైందని,మరోవైపు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం,బీమా నిధులు కూడా అందకపోవడంతో రైతు అన్ని వైపులా నష్టపోతున్నాడని తెలిపారు.పంట నష్టాల అంచనా ప్రక్రియ పూర్తయినప్పటికీ బీమా క్లెయిమ్‌లు ఏ దశలో ఉన్నాయనే విషయాన్ని ప్రభుత్వం వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.రైతులకు రావాల్సిన బీమా నిధుల విడుదలలో ఎందుకు జాప్యం జరుగుతోందో ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.రైతు కష్టకాలంలో అండగా నిలవాల్సిన ప్రభుత్వం బీమా చెల్లింపులను వాయిదా వేయడం రైతు వ్యతిరేక విధానమని సిపిఎం మండిపడింది. వెంటనే 2024--25 పంటల బీమా బకాయిలను విడుదల చేసి అర్హులైన ప్రతి రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేసింది.అలాగే పంటల బీమా దరఖాస్తు ప్రక్రియలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలంటే సిఎస్సీ కేంద్రాల వద్ద ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు.ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు సచివాలయాల్లో కూడా పంటల బీమా దరఖాస్తులు స్వీకరించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో రైతులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందన్నారు.ప్రభుత్వం వెంటనే పంటల బీమా నిధులను విడుదల చేసి రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రైతులు, వ్యవసాయ కార్మికులను సమీకరించి మండల,జిల్లా కేంద్రాల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇకనైనా ప్రభుత్వం ఆలస్యం చేయకుండా బీమా నిధులను విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై పదివేల కోట్ల స్కామ్ ఆరోపణలు

**జైలుకెళ్లడానికి సిద్ధమన్న మాజీ ఐపీఎస్**

**హైదరాబాద్, జూలై 15:**తెలంగాణ రాజకీయాల్లో మరో భారీ కుంభకోణం మరియు నిధుల దుర్వినియోగం వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ కీలక నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ టార్గెట్‌గా గురుకుల విద్యాలయాల కాలం నాటి నిధుల నిర్వహణపై సరికొత్త వివాదం చెలరేగింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒక సంచలన లేఖ రాయడంతో ఈ వ్యవహారం ఒక్కసారిగా వేడెక్కింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా పనిచేసిన 2013 నుంచి 2021 మధ్య కాలంలో భారీ స్థాయిలో ఆర్థిక అక్రమాలు జరిగాయని, సుమారు రూ. 10,000 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని గువ్వల బాలరాజు ఆ లేఖలో ఆరోపించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.గువ్వల బాలరాజు తన లేఖలో కేవలం ప్రవీణ్ కుమార్‌నే కాకుండా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలను కూడా లీగల్‌గా టార్గెట్ చేశారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి మద్దతుతోనే ఈ అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. సాధారణంగా సీనియర్ ఐఏఎస్ క్యాడర్ అధికారులు నిర్వహించాల్సిన గురుకులాల సెక్రటరీ బాధ్యతలను, ఐపీఎస్ అధికారి అయిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు దాదాపు పదేళ్లపాటు నిబంధనలకు విరుద్ధంగా అప్పగించడం వెనుక ఉన్న మతలబుపై కూడా సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. టెండర్



విధానాన్ని పక్కనబెట్టి నిధులు ఖర్చు చేశారని, నియామకాలు, ఉద్యోగాల క్రమబద్ధీకరణతో పాటు ఐఐటీ, జేఈఈ కోచింగ్ పేరుతో నిధులను పక్కదారి పట్టించారని పేర్కొంటూ.. ఈ అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.తనపై వచ్చిన ఈ అవినీతి ఆరోపణలపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తనదైన శైలిలో ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. గువ్వల బాలరాజు లేఖలోని అంశాలను పసలేని అబద్ధాలుగా కొట్టిపారేశారు. రాష్ట్రంలో రూ.82 వేల కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందనే ప్రచారం ఎంత పెద్ద అబద్ధమో.. అసలు కేవలం రూ.800 కోట్ల వార్షిక బడ్జెట్ మాత్రమే ఉన్న గురుకులాల్లో ఏకంగా రూ.10 వేల కోట్ల అవినీతి జరిగిందనడం కూడా అంతే పెద్ద అబద్ధం అంటూ ప్రాథమిక లాజిక్‌ను తెరపైకి తెచ్చారు. బడ్జెట్ పరిమితులను దాటి వేల కోట్లు దోచేశారనడం కేవలం బురదజల్లే చర్యేనని మండిపడ్డారు.ఈ మొత్తం వ్యవహారం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో ఇదే గువ్వల బాలరాజు అసెంబ్లీ వేదికగా తన పనితీరును, గురుకులాల ప్రగతిని ఎంతో పొగిడారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అధికార కాంగ్రెస్, బీజేపీ, మరియు బీఆర్ఎస్ అసంతృప్త నేతలు ఒక అపవిత్ర కూటమిగా ఏర్పడ్డారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, గువ్వల బాలరాజు ముగ్గురూ చేతులు కలిపి తనను రాజకీయంగా దెబ్బతీయడానికే ఈ స్క్రిప్ట్ నడుపుతున్నారని ఆరోపించారు. ఈ రాజకీయ యుద్ధంలో తాను వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. “నేనే గనుక ఏదైనా తప్పు చేసి ఉంటే, గురుకులాల నిధులు ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు ఉంటే నన్ను నేరుగా జైలుకు పంపండి” అంటూ ప్రభుత్వానికి మరియు దర్యాప్తు సంస్థలకు బహిరంగ సవాల్ విసిరారు. గురుకులాల విద్యార్థుల భవిష్యత్తు కోసం తాను రేయింబగళ్లు పడిన శ్రమను ఇప్పుడిలా రాజకీయ కక్షసాధింపులకు వాడుకోవడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ గురుకులాల వివాదం తెలంగాణ రాజకీయాల్లో మరిన్ని సంచలనాలకు దారితీసేలా కనిపిస్తోంది.

# ముద్రగడ అంత్యక్రియల్లో గందరగోళం


**గన్ సెల్యూట్ ను అడ్డుకున్న వైసీపీ కార్యకర్తలు**

**కాకినాడ, జూలై 15:** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా ఆయన స్వగ్రామమైన తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో తీవ్ర ఉద్రిక్తత, గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. సుదీర్ఘ కాలం పాటు ప్రజాసేవలో ఉన్న ముద్రగడకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే, ఈ అధికారిక లాంఛనాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక నేతలు అడ్డుపడటం అక్కడ తీవ్ర వివాదానికి దారితీసింది.అసలు వివాదం ఎక్కడ మొదలైందంటే.. ముద్రగడ కుటుంబ సభ్యులు ప్రభుత్వం కల్పించే అధికారిక గౌరవ వందనానికి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. కానీ, అక్కడ ఉన్న వైసీపీ నేతలు మాత్రం దీనికి ససేమిరా ఒప్పుకోమని భీష్మించుకు కూర్చున్నారు. చివరకు అంతిమ సంస్కారాల క్రతువు ముగిసే సమయంలో, నిబంధనల ప్రకారం పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించడానికి సిద్ధమవగా.. వైసీపీ శ్రేణులు పోలీసులకు అడ్డంగా నిలబడి నినాదాలు చేశారు. అధికారిక లాంఛనాలు అంటే అది ఏదో టీడీపీ లేదా జనసేన పార్టీలు ఇస్తున్న రాజకీయ గౌరవం కాదని, ఒక మాజీ మంత్రికి ప్రభుత్వం చట్టబద్ధంగా కల్పించే అత్యున్నత గౌరవమని అక్కడ ఉన్న పలువురు నచ్చే చెప్పే ప్రయత్నం చేసిన వినలేదు. మరోవైపు, కిర్లంపూడిలో బుధవారం ఉదయం నుంచే రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. ముద్రగడ కుమార్తెను కూడా అడ్డుకున్నారు. భీమవరంలో జరిగిన ఆక్వా రైతుల సదస్సును ముగించుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేరుగా కిర్లంపూడి చేరుకున్నారు. ముద్రగడ భౌతికకాయానికి పూలమాలలు వేసి అంజలి ఘటించిన జగన్.. ఆయన పార్థివదేహాన్ని కొద్దిదూరం భుజాలపై మోశారు. జగన్ పర్యటన , అంత్యక్రియల ఏర్పాట్ల మధ్య వైసీపీ స్థానిక నేతలు అత్యుత్సాహం ప్రదర్శించడం గందరగోళానికి మరింత ఆజ్యం పోసింది.సాధారణంగా ఏ పార్టీకి చెందిన రాజకీయ నాయకుడైనా.. సుదీర్ఘ కాలం పాటు శాసనసభ్యుడిగా, మంత్రిగా, ప్రజా ప్రతినిధిగా సేవలందించినప్పుడు వారి అంతిమయాత్రను అధికారిక ప్రభుత్వ లాంఛనాలతో జరపడం అనవాయితీ. కూటమి ప్రభుత్వం ముద్రగడకు ఈ గౌరవాన్ని కల్పించాలని ఆదేశించినప్పటికీ, కేవలం రాజకీయ కక్షసాధింపు కోణంలో వైసీపీ నేతలు ప్రవర్తించడంపై స్థానిక మేధావులు, తటస్థ కాపు సంఘాల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మరణంలో కూడా రాజకీయాలు వెతుక్కుంటూ ప్రభుత్వ గౌరవాన్ని అడ్డుకోవడం ముద్రగడ వ్యక్తిత్వానికి భంగం కలిగించడమేనని అసహనం వ్యక్తం చేశారు.ఈ రాజకీయ వివాదాలు, తోపులాటల మధ్యనే ముద్రగడ పద్మనాభ రెడ్డి అంత్యక్రియలు కిర్లంపూడిలో ముగిశాయి. ఇటు కుటుంబ సభ్యుల వేదన, అటు నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య ఆయన అంతిమయాత్ర సాగింది. ప్రభుత్వం కల్పించాలనుకున్న పూర్తి స్థాయి సైనిక వందనం గందరగోళం మధ్య పాక్షికంగానే ముగిసినప్పటికీ. పాలిటిక్స్‌లో తనదైన ముద్ర వేసిన ఒక వివాదాస్పద శకం కిర్లంపూడి మట్టిలో శాశ్వతంగా కలిసిపోయింది.

# తెలంగాణ ఎయిమ్స్ అద్భుతం

**హైదరాబాద్, జూలై 15:** తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో టీబీ పరీక్షల కోసం ఐసీఎంఆర్ ఎయిమ్స్ బిబినగర్ ఒక ప్రత్యేక డ్రోన్ సేవ ప్రారంభించాయి. సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి. భారత్‌లోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించడం ఎల్లప్పుడూ ఒక పెద్ద సవాలుగా ఉంది. ముఖ్యంగా క్షయవ్యాధి వంటి తీవ్రమైన వ్యాధుల విషయంలో, సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్స ప్రాణాలను కాపాడగలవు. ఈ సమస్యను పరిష్కరించడానికి తెలంగాణ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని ప్రారంభించింది.క్షయ (టీబీ) పరీక్షలను మరింత సులభతరం చేసేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (×జవీ=) తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో డ్రోన్ సేవలను ప్రారంభించింది. బిబినగర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ూ××మీూ) సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సాంకేతికత సామాన్య ప్రజల జీవితాలను ఎలా మారుస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.గమనించదగ్గ విషయం ఏమిటంటే, గతంలో గ్రామాల్లో నివసించే రోగులు తమ క్షయ పరీక్షలు చేయించుకోవడానికి నగరంలోని పెద్ద ఆసుపత్రులకు లేదా పరీక్షా కేంద్రాలకు ప్రయాణించవలసి వచ్చేది. దీనివల్ల వారి రోజంతా వృథా అయ్యేది, ప్రయాణానికి డబ్బు ఖర్చయ్యేది, చాలా నగదు కోల్పోయేవారు.గణాంకాల ప్రకారం, గతంలో ఒక రోగి పరీక్ష కోసం సగటున ?9,451 ఖర్చు చేయాల్సి వచ్చేది, కానీ ఇప్పుడు డ్రోన్ సేవల ప్రవేశంతో ఈ ఖర్చు కేవలం ?91కి తగ్గింది. రోగులు ఇప్పుడు తమ ఇంటి దగ్గర ఉన్న ఒక చిన్న ఆరోగ్య కేంద్రంలో కఫం నమూనాలను అందిస్తుండగా, అక్కడి నుంచి డ్రోన్‌లు ఈ నమూనాలను పెద్ద పరీక్షా కేంద్రాలకు తరలిస్తున్నాయి. దీనివల్ల రోగులకు డబ్బు, శ్రమ రెండూ ఆదా అవుతున్నాయి.క్షయ వ్యాధి చికిత్సకు దానిని ముందుగానే గుర్తించడం చాలా కీలకం. గతంలో, మారుమూల గ్రామాల నుంచి నమూనాలు ప్రయోగశాలకు చేరడానికి, ఫలితాలు రావడానికి 15 రోజుల వరకు పట్టేది. ఈ సుదీర్ఘ నిరీక్షణ రోగి పరిస్థితిని మరింత దిగజార్చే అవకాశం ఉంది. డ్రోన్ టెక్నాలజీ ఈ సమయాన్ని 15 రోజుల నుంచి కేవలం 5 రోజులకు తగ్గించింది. ఇటీవలి నివేదికల ప్రకారం, 76 శాతానికి పైగా రోగులు తమ పరీక్ష ఫలితాలను మరుసటి రోజే పొందుతున్నారు. వేగవంతమైన ఫలితాలు అంటే వేగవంతమైన చికిత్స, ఇది ప్రాణాలను కాపాడటానికి కీలకం.ఈ ప్రణాళికను ప్రణాళికాబద్ధమైన పద్ధతిలో అమలు చేశారు. ఎయిమ్స్ బిబినగర్ ఒక ప్రధాన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది, ఇది జిల్లాలోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, 60 చిన్న ఉప కేంద్రాలకు నేరుగా లింక్ చేసి ఉంది. వైద్య పరిభాషలో హబ్-అండ్-స్పోక్ మోడల్ అని పిలిచే ఈ నెట్‌వర్క్‌లో డ్రోన్‌లు ప్రయాణిస్తాయి. ఈ నెట్‌వర్క్ కింద, చిన్న కేంద్రాల నుంచి నమూనాలను సేకరించి, ప్రధాన ల్యాబ్‌కు వేగంగా రవాణా చేస్తారు.ఈ డ్రోన్ సేవ కేవలం నమూనాలను పంపడానికి మాత్రమే పరిమితం కాదు. ప్రధాన కేంద్రంలో రోగికి పాజిటివ్ అని తేలి, వైద్యులు మందులు సూచించినప్పుడు, అదే డ్రోన్ మారుమూల గ్రామాలకు తిరిగి వెళ్లి, అవసరమైన టీబీ మందులను అందిస్తుంది. దీనివల్ల రోగులు తమ మందుల కోసం నగరానికి పరుగెత్తాల్సిన అవసరం లేదు. మందులు ఆకాశంలో ఎగురుతూ వారి గ్రామ ఆరోగ్య కేంద్రానికి చేరుకుంటాయి.

# హైబీపీ ఎంత ఉందో లెక్కించాలంటే ఒక్కసారి రీడింగ్ సరిపోదు.. మరి ఏం చేయాలి..?




రక్తపోటు (హైబీపీ) గుండె జబ్బులకు ప్రధాన ప్రమాద కారకాలలో ఒకటి. అయినప్పటికీ చాలామంది సంవత్సరానికి ఒకసారి ఆరోగ్య పరీక్ష చేయించుకునే సమయంలో మాత్రమే రక్తపోటును పరీక్షించుకుంటారు. అయితే ఒక్కసారి తీసిన బీపీ రీడింగ్‌పై మాత్రమే ఆధారపడటం సరైన నిర్ణయం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్తపోటు అసలు స్థాయిని తెలుసుకోవాలంటే క్రమం తప్పకుండా కొలవడం అవసరమని సూచిస్తున్నారు. ఆసుపత్రి లేదా వైద్యుల క్లినిక్‌లో కొలిచే రక్తపోటు కొన్నిసార్లు వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించదు. దీనికి ప్రధాన కారణం వైట్ కోట్ సిండ్రోమ్. కొంతమంది ఆసుపత్రి వాతావరణంలో ఆందోళన, భయం లేదా ఒత్తిడికి గురవుతారు. ఈ మానసిక ఒత్తిడి కారణంగా తాత్కాలికంగా రక్తపోటు పెరిగి, సాధారణం కంటే ఎక్కువ రీడింగ్ నమోదయ్యే అవకాశం ఉంటుంది.

### ఇలా చేయాలి..

ఈ కారణంగా సంవత్సరానికి ఒకసారి తీసిన ఒక్క రీడింగ్ ఆధారంగా ఆరోగ్య నిర్ణయాలు తీసుకోవడం కంటే, ఇంట్లోనే క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల నిజమైన సగటు రక్తపోటు స్థాయిని తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీనికోసం 2-2-7 పద్ధతిని అనుసరించాలని సూచిస్తున్నారు. ఈ విధానంలో ఇంట్లో ఉపయోగించే ఆర్మ్ బ్లడ్ ప్రెజర్ మానిటర్‌తో ఉదయం, సాయంత్రం రోజుకు రెండుసార్లు రక్తపోటు కొలవాలి. ఇలా వరుసగా ఏడు రోజుల పాటు నమోదైన అన్ని రీడింగ్‌లను రాసి, వాటి సగటును లెక్కించాలి. ఈ సగటు విలువే వ్యక్తి వాస్తవ రక్తపోటు స్థాయిని మరింత కచ్చితంగా తెలియజేస్తుంది.

### అత్యంత సులభంగా నియంత్రించవచ్చు..

ప్రతి రీడింగ్‌ను తేదీ, సమయంతోపాటు నమోదు చేసుకోవడం వల్ల వైద్యుడికి కూడా సరైన సమాచారం అందుతుంది. అవసరమైతే చికిత్స లేదా మందుల విషయంలో మరింత సరైన నిర్ణయం తీసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. రక్తపోటుతో బాధపడుతున్న వారిలో చాలామందికి తమకు ఈ సమస్య ఉందనే విషయం కూడా తెలియదని నిపుణులు చెబుతున్నారు. హైబీపీ గుండె జబ్బులకు దారితీసే ప్రమాద కారకాలలో అత్యంత సులభంగా నియంత్రించగలిగే అంశమని పేర్కొంటున్నారు. అయితే దాన్ని నియంత్రించాలంటే ముందుగా దానిని గుర్తించడం అవసరం. అందుకే రక్తపోటును క్రమం తప్పకుండా కొలుస్తూ, స్థాయిలపై అవగాహన కలిగి ఉండడం దీర్ఘకాలిక గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

## ఏ వ్యాధులు ఉంటే ఏ ఆహారం ప్రమాదమో తెలుసా.. తెలియదంటే ఇప్పుడు తెలుసుకోండి..!




సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల ఆహారం పునాది లాంటిదని అందరికీ తెలుసు. అయితే మనం తీసుకునే ప్రతి ఆహారం అందరిపైనా ఒకే రకమైన ప్రభావం చూపదు. కొన్ని రకాల ఆనారోగ్య సమస్యలు (Health Issues) ఉన్నప్పుడు ఆరోగ్యకరమైనవిగా భావించే ఆహారపదార్థాలు కూడా హాని కలిగించవచ్చు. వ్యాధిని బట్టి ఆహార నియమాలను జాగ్రత్తగా పాటించడం చికిత్సలో ఒక కీలకమైన భాగంగా వైద్యులు సూచిస్తున్నారు. సరైన ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చు. మరి ఏ వ్యాధులు ఉంటే ఏ ఆహారాలు తీసుకోకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.. మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులతో బాధపడేవారు చాలా అప్రమత్తంగా ఉండాలి. మధుమేహం ఉన్నవారు స్వీట్లు, చక్కెర పానీయాలు, మైదా ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ కారణంగా ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను వేగవంతంగా పెంచుతాయి. అధిక రక్తపోటు బాధితులు ఉప్పు, ప్యాకేజ్డ్ స్నాక్స్, ఊరగాయలు వంటి సోడియం అధికంగా ఉండే పదార్థాలను మానుకోవాలి. లేదంటే శరీరంలో నీరు నిల్వ ఉండి రక్తపోటు మరింత పెరిగే ప్రమాదం ఉంది. గుండె జబ్బులు ఉన్నవారు డీప్ ఫ్రైడ్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన మాంసం, బేకరీ పదార్థాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను పెంచి, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడానికి కారణమవుతాయి. ఇక కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు పాలకూర, రాగులు, జీడిపప్పు, డార్క్ చాక్లెట్ వంటివి తినకపోవడమే మంచిది. వీటిలోని ఉండే ఆక్సలేట్లు కాల్షియంతో కలిసి రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి. గౌట్ సమస్యతో బాధపడేవారు రెడ్ మీట్, కొన్ని రకాల సముద్ర చేపలు, మద్యానికి దూరంగా ఉండాలి. వీటిలోని ప్యూరిన్లు శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచి కీళ్ల నొప్పులు, వాపులకు దారితీస్తాయి. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు చక్కెర పానీయాలు, జంక్ ఫుడ్, మద్యపానాన్ని పూర్తిగా మానుకోవాలి. ఇవి కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని ప్రోత్సహిస్తాయి. గ్యాస్ట్రిక్, యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారు కారం, మసాలాలు, కాఫీ వంటివి తగ్గిస్తే ఉపశమనం లభిస్తుంది. హైపోథైరాయిడిజం సమస్య ఉన్నవారు గోయిట్రోజెన్లు ఉండే క్యాబేజీ, క్యాలీఫ్లవర్ వంటి ఆహారాలను వైద్యుల సలహా మేరకు పరిమితంగా తీసుకోవాలి. ఇవి థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిపై ప్రభావం చూపవచ్చు. కాబట్టి ఆహారం విషయంలో మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఏది తినాలో, ఏది తినకూడదో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఏవైనా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటే, వైద్యులు లేదా డైటీషియన్ సలహా మేరకు ఆహార ప్రణాళికను రూపొందించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

## రోజూ మనం వాడే టూత్‌పేస్టులతో క్యాన్సర్ వస్తుందా.. నిపుణులు ఏం చెబుతున్నారు..?

దేశంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రోజువారీగా ఉపయోగించే అనేక వస్తువులపై భయాలు, అపోహలు కూడా వేగంగా వ్యాపిస్తున్నాయి. అలాంటి వాటిలో టూత్‌పేస్ట్ కూడా ఒకటి. టూత్‌పేస్ట్‌లో ఉండే కొన్ని రసాయనాలు క్యాన్సర్‌కు కారణమవుతాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. టూత్‌పేస్ట్ క్యాన్సర్‌కు కారణమవుతుందనేది పూర్తిగా అపోహ మాత్రమేనని చెబుతున్నారు. ఈ అపోహకు కారణం ఒకేలా వినిపించే రెండు వేర్వేరు రసాయనాలను గందరగోళానికి గురి చేయడమేనని వివరిస్తున్నారు. చాలా టూత్‌పేస్ట్‌లలో సోడియం లారిల్ సల్ఫేట్ (Sodium Lauryl Sulphate -- SLS) అనే పదార్థం ఉంటుంది. ఇది టూత్‌పేస్ట్‌లో నురుగు ఏర్పడటానికి, దంతాలను శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. అయితే కొందరు దీనిని సోడియం లారెత్ సల్ఫేట్ (Sodium Laureth Sulphate -- SLES)తో పొరపాటు పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. SLES తయారీ ప్రక్రియలో ఏర్పడే కొన్ని ఉప ఉత్పత్తులు విషపూరిత ప్రభావాలకు సంబంధించిన చర్చల్లో ఉంటాయి. ఈ రెండు రసాయనాల పేర్లు ఒకేలా ఉండటంతోనే టూత్‌పేస్ట్ క్యాన్సర్‌కు కారణమనే అపోహ వ్యాపించిందని అంటున్నారు.

### క్యాన్సర ప్రమాదం ఉంటుందా..

SLS వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే కొంతమందిలో ఇది నోటి లోపలి పొరను స్వల్పంగా చికాకు పెట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా తరచూ నోటి పుండ్లు రావడం, నోటి లోపలి చర్మం అత్యంత సున్నితంగా ఉండటం లేదా దంతాలను తోమేటప్పుడు మంటగా అనిపించడం వంటి సమస్యలు ఉన్నవారిలో ఈ ప్రభావం కనిపిస్తుంది. ఇలాంటి సమస్యలు ఎదురయ్యే వారు SLS లేని టూత్‌పేస్ట్‌ను ఉపయోగిస్తే అసౌకర్యం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ఇలాంటి సున్నితత్వం లేని వారిలో SLS సాధారణంగా సురక్షితంగానే ఉంటుంది.

### పరిశ్రమల్లో వినియోగించినా..

కొంతమంది నానా పరిశ్రమల్లో కూడా ఉపయోగించే రసాయనం కాబట్టి అది ప్రమాదకరమని భావిస్తుంటారు. అయితే ఒక పదార్థాన్ని పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నారనే కారణంతోనే అది మన ఆరోగ్యానికి హానికరమని చెప్పలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.




మనం ప్రతిరోజూ ఉపయోగించే నీరు కూడా అనేక పరిశ్రమల్లో వినియోగిస్తారని, కాబట్టి ఒక పదార్థం పారిశ్రామిక వినియోగంలో ఉందనే ఒక్క కారణంతో దానిని విషపూరితమని భావించడం సరైన విధానం కాదని పేర్కొంటున్నారు. అలాగే ప్రతి టూత్‌పేస్ట్ అందరికీ ఒకేలా సరిపోదని నిపుణులు చెబుతున్నారు. దంతాలు, చిగుళ్ల సున్నితత్వం, నోటి ఆరోగ్య పరిస్థితులను బట్టి టూత్‌పేస్ట్‌ను ఎంపిక చేసుకోవడం మంచిదని, అవసరమైతే దంతవైద్యుడి సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

## ప్రసవానంతరం మహిళలు ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి.. ఏయే సమస్యలు ఉంటాయి..?

ప్రసవం తర్వాత మహిళ శరీరం పూర్తిగా కోలుకోవడానికి, అలాగే శిశువుకు తల్లిపాలు అందించడానికి సరైన పోషకాహారం అత్యంత కీలకం. గర్భధారణ సమయంలో పోషకాహారంపై ఎంత శ్రద్ధ అవసరమో, ప్రసవానంతరం కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ దశలో సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శరీర పునరుద్ధరణ వేగవంతమవడంతోపాటు శక్తి పెరుగుతుంది, తల్లిపాల ఉత్పత్తికి కూడా మేలు జరుగుతుంది. ప్రసవం తర్వాత శరీరం తీవ్రమైన శారీరక ఒత్తిడిని ఎదుర్కొంటుంది. సాధారణ ప్రసవమైనా, సిజేరియన్ అయినా శరీరానికి కోలుకునే సమయం అవసరం. ఈ సమయంలో ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల కండరాల పునరుద్ధరణ, గాయాలు త్వరగా మానడం, శరీర కణజాలం మరమ్మత్తు కావడంలో సహాయపడుతుంది. గుడ్లు, పనీర్, పప్పులు, టోఫూ, చికెన్ వంటి ఆహారాలను రోజువారీ భోజనంలో చేర్చుకోవడం మంచిది.

### ఐరన్, క్యాల్షియం ఉండే ఆహారాలు..

ప్రసవ సమయంలో రక్తనష్టం జరగడం వల్ల ఐరన్ లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుకే శరీరంలోని ఐరన్ నిల్వలను పునరుద్ధరించేందుకు పాలకూర, బీట్‌రూట్, బెల్లం, ఖర్జూరం, లీన్ మీట్ వంటి ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారాలను తీసుకోవాలి. దీంతో రక్తహీనత ప్రమాదం కూడా తగ్గుతుంది. మంచి కొవ్వులు (హెల్తీ ఫ్యాట్స్) కూడా ప్రసవానంతర పోషకాహారంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. డ్రై ఫ్రూట్స్, గింజలు, విత్తనాలు వంటి ఆహారాల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా హార్మోన్ల సమతుల్యతకు కూడా



తోడ్పడతాయి. అలాగే ఎముకల ఆరోగ్యానికి పెరుగు, పాలు, నువ్వులు, రాగి వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. ప్రసవం తర్వాత, ముఖ్యంగా తల్లిపాలు ఇస్తున్న మహిళలకు తగినంత నీరు తాగడం చాలా అవసరం. శరీరంలో ప్రతి కణం సక్రమంగా పనిచేయడానికి, జీర్ణక్రియ మెరుగుపడడానికి, తల్లిపాల ఉత్పత్తి సక్రమంగా సాగడానికి హైడ్రేషన్ కీలకం. రోజుకు సుమారు 2.5 నుంచి 3 లీటర్ల వరకు ద్రవాలు తీసుకోవాలి. సాధారణ నీటితోపాటు కొబ్బరి నీరు, మజ్జిగ, చికెన్ సూప్, పప్పు సూప్ వంటి పోషక విలువలు కలిగిన ద్రవాలను కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు.

### తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు..

ప్రసవానంతరం రోజుకు మూడు పెద్ద భోజనాల కంటే తక్కువ మోతాదులో తరచూ ఆహారం తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల శరీరానికి నిరంతరం శక్తి అందుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా తగ్గిపోవడాన్ని నివారించవచ్చు. దీంతో ప్రసవానంతర అలసట కూడా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో ప్రాసెస్ చేసిన స్నాక్స్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, అధిక కాఫీ, మద్యం వంటి వాటిని వీలైనంత వరకు తగ్గించాలి. వీటి బదులుగా తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గింజలు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. ఫైబర్ తక్కువగా తీసుకుంటే మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. సాంప్రదాయ ఆహారాల్లో అజ్వైన్ (వాము), మెంతులు, జీలకర్ర, గోండ్ వంటి పదార్థాలు కూడా ప్రసవానంతర కాలంలో ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు కడుపు ఉబ్బరం తగ్గించడంలో సహాయపడతాయి. గోండ్ లడ్డూలు, వాము నీరు, మెంతులతో చేసిన వంటకాలు ప్రసవం తర్వాత కోలుకునే ప్రక్రియకు తోడ్పడతాయి.

# డబ్బు గుంజేందుకే నా పరువు తీశారు: పంజాబ్ కింగ్స్ ప్లేయర్

## తప్పుడు ఎఫ్ఐఆర్‌తో తనను బ్లాక్‌మెయిల్ చేశారన్న శశాంక్ సింగ్

## డబ్బు గుంజడానికే పరువు తీసే కుట్ర జరిగిందని ఆరోపణ

## పనిలో పెట్టుకున్న వ్యక్తికి 9 కేసుల నేర చరిత్ర ఉందని వెల్లడి

## మా వాదన వినకుండానే కేసు నమోదు చేశారంటూ ఆవేదన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్ తనపై, తన కుటుంబంపై ఇటీవల నమోదైన కేసుపై తాజాగా స్పందించాడు. సెలబ్రిటీగా తనకున్న పేరును దెబ్బతీసి, డబ్బు గుంజేందుకే ఓ వ్యక్తి తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సంచలన ఆరోపణలు చేశాడు. తనపై దాడి జరిగిందంటూ ఓ వంట మనిషి పెట్టిన కేసు పూర్తిగా కట్టుకథ అని, ఇది పరువు తీసి డబ్బు రాబట్టేందుకు పన్నిన కుట్ర అని సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్ ద్వారా వివరించాడు.గత నెలలో భోపాల్‌లోని తమ నివాసంలో పనిచేసే వంట మనిషిపై దాడి చేసి, ఫోన్ లాక్కున్నారని శశాంక్ సింగ్, ఆయన తండ్రి, రిటైర్డ్ స్పెషల్ డీజీపీ శైలేష్ సింగ్‌పై రతిబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను శశాంక్ పూర్తిగా ఖండించాడు. "నిజానిజాలు తెలుసుకోకుండా వేలమంది నన్ను దూషించారు. ఒక నిరుపేదను కొట్టిన వ్యక్తిగా నన్ను చిత్రీకరించారు. ఈ ఘటన నన్ను మార్చేసింది, జీవితాంతం గుర్తుంచుకునే పాఠాలు నేర్పింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు.తమ వద్ద పనికి చేరిన వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండేదని, ఇంట్లో తిరుగుతూ ఫొటోలు తీసి ఇతరులకు పంపేవాడని శశాంక్ తెలిపాడు. దీంతో మూడో రోజే అతడిని పనిలో నుంచి పంపించేశామని, అప్పుడు అతను ఆరోగ్యంగానే వెళ్లాడని స్పష్టం చేశాడు. "ఆ తర్వాత అతడు తీవ్రంగా గాయపడినట్లు వీడియోలో చూసి మేం షాక్ అయ్యాం. పోలీసు రికార్డుల ప్రకారం అతనిపై అప్పటికే హత్యాయత్నం, గృహ చౌర్యం, దాడి, బెదిరింపులు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసులు సహా మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయి. తన గుర్తింపును దాచుకోవడానికి మూడు వేర్వేరు పేర్లు వాడుతున్నాడు" అని శశాంక్ వెల్లడించాడు.ఒక తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా తనపై ఒత్తిడి తెచ్చి, డబ్బు రాబట్టుకోవాలన్నదే అతని ప్రణాళిక అని తాను నమ్ముతున్నానని శశాంక్ పేర్కొన్నాడు. "సాధారణ బాధితులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే ఇబ్బంది పడుతుంటే, మా వైపు వాదన వినకుండానే ఇంత వేగంగా కేసు ఎలా నమోదు చేశారని ఆశ్చర్యపోయాను" అని అన్నాడు. ఏప్రిల్ 30న కూడా తాను ఇలాంటి పనే చేశానని వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు. ఆ రోజు తాను ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్నానని, కనీస నిజ నిర్ధారణ లేకుండా వార్తలు రాసి పరువు తీస్తున్నారని విమర్శించాడు.ఈ అనుభవంతో కొన్ని కఠినమైన పాఠాలు నేర్చుకున్నానని చెబుతూ, ప్రజలకు శశాంక్ ఒక ముఖ్యమైన సూచన చేశాడు. "ఇంట్లో పనిచేసే వారిని నియమించుకునే ముందు రిజిస్టర్డ్ ఏజెన్సీల ద్వారా, పూర్తి పోలీసు వెరిఫికేషన్ తర్వాతే తీసుకోవాలి. జాలి అనేది ఇంగితజ్ఞానాన్ని భర్తీ చేయకూడదు. సత్యానికి సమయం పట్టినా, చివరికి అదే గెలుస్తుంది" అని చెప్పుకొచ్చాడు.

# భారత జట్టులో భారీ మార్పులు.. గంభీర్ నమ్మిన బంటులపై వరుసగా వేటు?





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు ఓటముల పరంపర కొనసాగుతున్న వేళ తెరవెనుక మరో పెద్ద సంక్షోభం స్టార్ట్ అయింది. ఐర్లాండ్ చేతిలో 2--0తో, ఇంగ్లాండ్ చేతిలో 4--0 తేడాతో టీ20 సిరీస్‌లను ఘోరంగా ఓడిపోవడంతో.. ఇండియా కోచింగ్ స్టాఫ్‌లో అనిశ్చితి నెలకొంది. జట్టు ప్రదర్శనపై బీసీసీఐ త్వరలోనే రివ్యూ మీటింగ్ నిర్వహించనుండగా, ఆలోపే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు బిగ్ షాక్ తగిలింది. గంభీర్ కి ఎంతో నమ్మకంగా జట్టులోకి తీసుకున్న సపోర్ట్ స్టాఫ్?లోని ఇద్దరు తప్పుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుత ఇంగ్లాండ్ టూర్ ముగిసిన వెంటనే అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్కాట్, ఫాస్ట్ బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ భారత్‌ను వీడబోతున్నట్లు తెలుస్తుంది.

**భారత్‌ని వీడి ఐపీఎల్‌లోకి:**

గత 2024లో గౌతమ్ గంభీర్ భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు, ఈ ఇద్దరు కోచ్‌లు జట్టులో జాయిన్ అయ్యారు. ఇండియన్ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలను బలోపేతం చేయడం కోసం గంభీర్ స్వయంగా వీరిద్దరిని తుది జట్టులోకి తీసుకున్నాడు. కానీ, ర్యాన్ టెన్ డోస్కాట్ టీమిండియాతో కొనసాగడానికి అంతగా ఇంట్రెస్ట్ చూపించలేదు.. ఏడాది పాటు జట్టుతో కలిసి ప్రయాణించిన తనకు ఇబ్బందిగా మారిందని ఆయన బీసీసీఐకి తెలిపినట్లు టాక్. దీనికి తోడు ఆయన ఒక ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీతో కోచింగ్ పదవి కోసం చర్చలు జరుపుతున్నట్లు వార్త కథనాలు నడుస్తున్నాయి. మరోవైపు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా వన్డే సిరీస్ ముగిసిన తర్వాత తన భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది.

**జింబాబ్వే టూర్‌కు గంభీర్ ఔట్:**

ఇంగ్లండ్ టూర్ ముగిసిన వెంటనే ఇండియన్ టీమ్ జూలై 2026 చివరి వారంలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అక్కడ జింబాబ్వేతో 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. జూలై 23న మొదటి టీ20, జూలై 25న రెండో మ్యాచ్, జూలై 26న మూడో మ్యాచ్ జరగనున్నాయి. కానీ, ఈ జింబాబ్వే పర్యటనకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ని బీసీసీఐ తప్పించింది. అతడికి రెస్ట్ ఇవ్వాలని బోర్డు భావిస్తోంది. గంభీర్ స్థానంలో నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ టూర్ కి తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు.

**శ్రీలంక టూర్ కి కొత్త బౌలింగ్ కోచ్:**

ఒకవేళ మోర్నీ మోర్కెల్, ర్యాన్ టెన్ డోస్కాట్ ఇద్దరూ జట్టు నుంచి తప్పుకోవాలని ఫిక్స్ అయితే, బీసీసీఐ చాలా వేగంగా స్పందించాల్సి ఉంది. ఎందుకంటే ఆ వెంటనే శ్రీలంక పర్యటనకు టీమిండియా వెళ్లబోతుంది. ఆగస్టు 2026లో జరగబోయే ఈ శ్రీలంక టూర్ లో ఇండియా రెండు టెస్టుల సిరీస్ ఆడబోతుంది. ఆగస్టు 15వ తేదీన గాలే వేదికగా మొదటి టెస్ట్, ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబో వేదికగా రెండో టెస్ట్ జరగనున్నాయి. మోర్కెల్ లేకపోతే, ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న టీమిండియా మాజీ పేసర్ లక్ష్మీపతి బాలాజీని శ్రీలంక టూర్‌కు తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా పంపడానికి బీసీసీఐ యోచిస్తుంది.

**ఫీల్డింగ్ కోచ్ టీ.దిలీప్‌పైనా వేటు?**

భారత్ వరుస పరాజయాలతో కేవలం అసిస్టెంట్, బౌలింగ్ కోచ్‌లు మాత్రమే కాదు, ఫీల్డింగ్ కోచ్ దిలీప్ పోస్టుపై కూడా కత్తి వేలాడుతుంది. గత కొంతకాలంగా ఇండియన్ టీమ్ ఫీల్డింగ్ ప్రమాణాలు భారీగా పడిపోవడంతో.. బోర్డు ఆయనపై కూడా అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద గంభీర్ కోచింగ్ టీమ్‌లోని సభ్యులు తప్పుకోవడానికి రెడీ కావడం, మరికొందరిపై బీసీసీఐ వేటు వేసేందుకు సిద్ధమైంది. రాబోయే రోజుల్లో టీమిండియా సపోర్ట్ స్టాఫ్ పూర్తిగా మారిపోయే ఛాన్స్ కనిపిస్తున్నాయి.

# 230 కోట్ల ఆస్తిపరుడైనా సాధారణ జీవితం!



నాభా నటేష్ 'గోల్డెన్ అవర్' గ్లామర్ - కెరీర్, అరంగేట్రం రాబోయే చిత్రాలు



కోలీవుడ్ అత్యంత ప్రతిభావంతులైన నటులలో ధనుష్ ఒకరు. నటుడిగా, గాయకుడిగా, గీత రచయితగా, దర్శకుడిగా , నిర్మాతగా పరిశ్రమలో తనదైన ముద్ర వేసారు. కెరీర్ ఆరంభం నుండి గ్లోబల్ స్టార్ స్థాయి వరకు ఆయన ఎదిగిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకం. అంతేనా 230 కోట్ల రూపాయల ఆస్తిపరుడు. విలాసవంతమైన జీవనశైలి తో పాటు అత్యంత సంపన్న నటులలో ఒకరిగానూ నిలుస్తున్నారు. ధనుష్ ఆస్తుల విషయానికి వస్తే ఆయనకు చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన పోయెస్ గార్డెన్‌లో 150 కోట్ల రూపాయల విలువైన బంగ్లా ప్రధానాకర్షణగా నిలుస్తుంది. అత్యంత భద్రత .. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ భవనం నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఒకటి. అంతే కాదు అళ్వార్‌పేట ప్రాంతంలో 18 కోట్ల రూపాయల విలువైన మరొక లగ్జరీ బంగ్లా కూడా ఉంది. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు ఆయన ఆర్థిక భవిష్యత్తుపై ఉన్న దూరదృష్టిని తెలియజేస్తున్నాయి. వాహనాల విషయానికి వస్తే ధనుష్‌కు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. సేకరణలో రోల్స్ రాయిస్ ఘోస్ట్, రోల్స్ రాయిస్ స్పెక్టర్ , బెంట్లీ కాంటినెంటల్ జిటి , ఫోర్డ్ ముస్టాంగ్ వంటి అత్యంత ఖరీదైన వేగవంతమైన వాహనాలున్నాయి. 7.5 కోట్ల రూపాయల విలువైన రోల్స్ రాయిస్ స్పెక్టర్ ఎలక్ట్రిక్ సెడాన్‌ను ఇటీవల కొనుగోలు చేసారు. ఆధునిక సాంకేతికత .. విలాసం పట్ల ఆసక్తిని చాటి చెబుతోంది. ధనుష్ ఒక్కో చిత్రానికి 20 నుంచి 35 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటారు. బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల ద్వారా కూడా భారీగా ఆర్జిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 3 కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని పొందుతుంటారని అంచనా. అంతర్జాతీయ చిత్రాల్లో నటించడం, సొంత నిర్మాణ సంస్థ వుండర్‌బార్ ఫిలిమ్స్ ద్వారా చిత్రాలను నిర్మించడం వంటివి ధనుష్ ఆర్థిక మూలాలను మరింత బలోపేతం చేస్తున్నాయి.అంతటి సంపద, విలాసాలు ఉన్నా? ధనుష్ వ్యక్తిగతంగా చాలా సాధారణంగా ఉంటుంది. బయటకు వెళ్లాలంటే పలానా బ్రాండ్ కారు ఉండాలని లేదు. ఆ సమయానికి ఏది అందుబాటులో ఉంటే అందులో వెళ్లిపోతారు. షూటింగ్ సమయంలో ఎలాంటి పరిస్థితులున్నా? సర్దుకుపోవడం ధనుష్ ప్రత్యేకతగా చెబుతున్నారు. అలాగే పనిపై చూపే నిబద్ధత ..క్రమశిక్షణే ధనుష్ ని ఈ స్థాయికి చేర్చాయి. దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్నా? ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటారు. ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తనను తాను మలచుకోవడం ధనుష్ ప్రత్యేకత. ఆస్తులు ఎంతటివైనా? తన నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల మనసుల్లో ఆయన సంపాదించుకున్న గుర్తింపు అన్నిటికంటే మిన్న. ఆర్థికంగా ఎంత ఎదిగినా? కళాత్మక విలువలను వదులుకోకుండా, నటుడిగా , దర్శకుడిగా కొత్త శిఖరాలను అధిరోహించడం ధనుష్ గొప్పతనం.



స్టైలిష్ ఫోటోషూట్ లుక్‌లో ఐశ్వర్య రాజేష్ ఆకర్షణీయ మైన రూపం

# వాణిజ్య నౌకలపై దాడులు ఆగిపోవాలి



హర్మూజ్ జలసంధి వంటి అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకం కలిగించడాన్ని, అందులోని సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన లక్షిత దాడులపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి చెందిన డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) మహమ్మద్ జావాద్ హొస్సేనీను భారత విదేశాంగ శాఖ పిలిపించిన వెంటనే ఈ అధికారిక ప్రకటన వెలువడింది. కాగా, ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణులతో దాడి చేయగా, ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మృతి చెందాడు. పలువురు గాయపడ్డారు. అనంతరం భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది.
సముద్ర మార్గాల్లో దాడులు పునర్ ప్రారంభం కావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో ప్రశాంతత, భద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు శత్రుత్వాలకు తక్షణమే ముగింపు పలకాలని పిలుపునిచ్చింది. అలాగే శాంతి కోసం చర్చలు, దౌత్యపరమైన సంప్రదింపులు జరపాలని కోరింది. అంతర్జాతీయ చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ప్రపంచ నౌకాయాన మార్గాల్లో అడ్డంకులు లేని రాకపోకలు, సముద్ర వాణిజ్యాన్ని త్వరగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. పశ్చిమాసియాలోని వాణిజ్య నౌకలు, సైనికేతర కేంద్రాలపై దాడులు ఆగిపోవాలని పేర్కొంది.

**‘క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం’**

ఒమన్ తీరంలో అల్ బాహియా, మొంబాసా అనే పేరు గల రెండు నౌకలపై జరిగిన దాడుల పట్ల భారత్ తీవ్ర ఆందోళన చెందుతోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ రెండు నౌకల్లో మొత్తం 46 మంది సిబ్బంది ఉండగా, వారిలో 30 మంది భారతీయులేనని తెలిపారు. అల్ బాహియాలో పనిచేస్తున్న 12 మంది భారతీయులలో ఒకరు మరణించారని, మరొకరు గాయపడ్డారని పేర్కొన్నారు. మొంబాసాలో ఉన్న 18 మంది భారతీయుల్లో 9 మంది సిబ్బంది గాయపడ్డారని, వీరిలో ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని వెల్లడించారు. అలాగే మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
“బాధిత భారతీయ నావికులకు అవసరమైన సహాయం అందేలా చూసేందుకు యూఏఈలోని ఇండియన్ ఎంబసీ, కాన్సులేట్ అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. యూఏఈ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయ నావికుడు మరణించాడు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన తెలియజేయడానికి మంగళవారం దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌ను భారత్ పిలిపించింది. పశ్చిమాసియాలో జరుగుతున్న అన్ని పరిణామాలను మేము నిశితంగా గమనిస్తున్నాం. హర్మూజ్ జలసంధి గుండా సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన నౌకాయానానికి, వాణిజ్యానికి మద్దతుగా మేము మా వైఖరిని స్థిరంగా కొనసాగిస్తున్నాం. ఎందుకంటే హర్మూజ్‌లో నౌకాయానం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక, ఇంధన భద్రతను కల్పించడంలో సహాయపడుతుంది” అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

**అక్కడి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం : యూఏఈలోని ఇండియన్ ఎంబసీ**

హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై జరిగిన దాడిలో భారతీయ నావికుడు మరణించడంపై యూఏఈలోని ఇండియన్ ఎంబసీ స్పందించింది. భారతీయ నావికుడి మృతికి సంతాపం తెలిపింది. అక్కడి పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. “అల్ బహియా, మొంబాసా అనే రెండు నౌకలపై జరిగిన దాడుల్లో ఒక భారతీయ నావికుడు విషాదకరంగా మరణించడం పట్ల మేము సంతాపం తెలియజేస్తున్నాం. అక్కడి పరిస్థితిని మేము నిశితంగా గమనిస్తున్నాం. గాయపడిన వారికి, వారి కుటుంబాలకు అండగా ఉండడానికి స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం” అని యూఏఈలోని ఇండియన్ ఎంబసీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

**ఇరాన్‌పై యూఏఈ ఫైర్**

మరోవైపు, హర్మూజ్‌లో తమ దేశ నౌకలపై దాడుల జరగడంపై యూఏఈ తీవ్రంగా మండిపడింది. ఈ దాడులను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా పేర్కొంది. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని తెలిపింది. పరిస్థితిని ఎదుర్కొనేందుకు భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేసినట్లు ప్రకటించింది. ఇరాన్ వెంటనే ఇలాంటి రెచ్చగొట్టే దాడులను నిలిపివేయాలని, అన్ని రకాల ఘర్షణలను షరతులు లేకుండా విరమించాలని, హర్మూజ్‌ను పూర్తిగా తెరవాలని కోరింది. ప్రపంచ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం కోసం ఇది అత్యవసరమని అభిప్రాయపడింది.

# “కోర్టునే తప్పుదోవ పట్టిస్తారా?



దివ్యాంగులపై జోకులు వేసి, కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించిన హాస్య నటుడు సమయ్? రైనా, యూట్యూబర్లు రణవీర్ అల్హాబాదియా, ఆశీష్? చంచలానీలపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వీరంతా తమకు తాముగా ‘యూత్ ఐకాన్లు’గా ప్రకటించుకున్నారని వ్యాఖ్యానించింది. సమయ్ రైనా, రణ్‌వీర్ అల్హాబాదియాతోపాటు మరికొందరు కమెడియన్లు దివ్యాంగులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఎస్?ఎంఏ క్యూర్ ఫౌండేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనితో గతంలో విచారణ చేసిన న్యాయస్థానం, దివ్యాంగులకు గౌరవ, మర్యాదలు ఇవ్వాలని, వారి విజయాల గురించి ఈ కమెడియన్స్? తమ షోలలో చెప్పాలని ఆదేశించింది. అంతేకాదు తమ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి, వచ్చిన నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది. తాజాగా చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దీనిపై మరోసారి విచారణ చేపట్టింది. సమయ్ రైనా తన షోకి వికలాంగులను ఆహ్వానించకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.
“సమయ్ రైనా కోర్టును తప్పుదోవ పట్టించానడంలో మాకు ఎలాంటి సందేహం లేదు. ఈ కోర్టు ముందు ఇచ్చిన ఉత్తర్వులను అతడు పూర్తిగా బరితెగించి ఉల్లంఘించాడు. నిన్న కంప్లయన్స్? అఫిడవిట్? దాఖలు చేశామని పేర్కొన్నాడు. కానీ అతను ఎలాంటి అఫిడవిట్ దాఖలు చేయలేదు. ఇది తీవ్రమైన దుష్ప్రవర్తన. దేశం వెలుపల ఉండడం వల్ల తాము న్యాయవ్యవస్థ పరిధికి అతీతులమని వారు భావిస్తున్నారు. ఇది అహంకారం కాకపోతే మరేంటి? ఒకవేళ ఇది అహంకారం కాకపోతే, మనం ఆక్స్?ఫర్డ్ డిక్షనరీని కూడా మార్చాలి ఉంటుంది” అని సీజేఐ సూర్యకాంత్? ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత సమయ్? రైనాకు రూ.10 లక్షల జరిమానా విధించారు. తరువాత అతని న్యాయవాది అభ్యర్థనతో దానిని రూ.3 లక్షలకు తగ్గించారు. మరోసారి తప్పు చేస్తే ఈ మొత్తాన్ని రూ.30 లక్షలకు పెంచుతామని హెచ్చరించారు. జరిమానాను 2 వారాల్లోగా సుప్రీంకోర్టుకు జమ చేయాలని సీజేఐ ఆదేశించారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

“స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్?ఎంఏ) వ్యాధి చికిత్సకు అయ్యే అధిక ఖర్చుపై సమయ్ రైనా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అక్కడితో ఆగకుండా ఆ వైకల్యం ఉన్న ఒక వ్యక్తిని ఎగతాళి చేశాడు” అని క్యూర్ ఎస్ఎంఏ ఇండియా ఫౌండేషన్ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. ‘ఇండియాస్ గాట్ లేటెంట్’ హోస్ట్‌గా ఉన్న సమయ్ రైనాతోపాటు ఇతర సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు విపున్ గోయల్, బాల్‌రాజ్ పరమ్‌జీత్ సింగ్ ఘాయ్, సోనాలీ థక్కర్, నిశాంత్ జగదీశ్ తన్వర్ దివ్యాంగులపై వేసిన అసభ్యకరమైన, అనుచితమైన జోకులు గురించి తెలిపింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సదరు సంస్థ తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ అపరాజితా సింగ్, సమయ్ రైనా తను నిర్వహించిన షోలకు దివ్యాంగులనుకానీ, తమను కానీ ఆహ్వానించలేదని చెప్పారు. దీనితో సుప్రీంకోర్టు సదరు ఇన్‌ఫ్లూయెన్సర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.
వికలాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కఠిన చట్టం అవసరమని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే దివ్యాంగులను, అరుదైన జన్యుపరమైన రుగ్మతలతో బాధపడేవారిని అవమానంచేలా లేదా ఎగతాళి చేసేలా వ్యాఖ్యలు చేయడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించాలని పేర్కొంది. ఇందుకోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అంతేకాదు భవిష్యత్తులో తమ ప్రవర్తన పట్ల జాగ్రత్తగ ఉండాలని ఇన్?ఫ్లూయెన్సర్లను హెచ్చరిస్తూ, దివ్యాంగుల విజయగాథనలపై నెలకు రెండు కార్యక్రమాలు లేదా షోలు నిర్వహించాలని సమయ్ రైనాను, ఇతరులను ధర్మాసనం ఆదేశించింది. కానీ వారు అలా చేయకపోవడంతో తాజాగా సుప్రీంకోర్టు వారిపై ఆగ్రహం వ్యక్తం చూస్తూ, జరిమానా విధించింది.

# 3 ఏళ్ల ఫీజు వాపసు ఇచ్చేయండి

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పెంపుపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు గత నాలుగేళ్ల ఫీజు రికార్డులను పది రోజుల్లోగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఏటా 5 శాతానికి పైగా ఫీజులు పెంచిన ప్రైవేట్ పాఠశాలలు, ఆ అదనపు మొత్తాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లించాలని పేర్కొన్నారు. ఇకపై ఫీజు రికార్డులకు సంబంధించిన సమాచారం విద్యాశాఖ పోర్టల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఇకపై ప్రైవేట్ పాఠశాలలు వార్షిక ఫీజులను 5శాతానికి మించి పెంచకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు సీఎం. ఒకవేళ ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత పాఠశాలలపై రూ.50వేల నుంచి రూ.1 లక్షవరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే, ఆ పాఠశాల గుర్తింపును కూడా రద్దు చేస్తామన్నారు. ఈ మేరకు కొత్త ఆర్డినెన్స్? జారీ చేశారు. అయితే, ఈ నిర్ణయం ద్వారా పంజాబ్‌లోని దాదాపు 32లక్షలకు పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రయోజనం పొందుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఆర్డినెన్స్ అమలుతో, పంజాబ్‌లోని ప్రైవేట్ పాఠశాలలు వార్షిక ఫీజులను 5 శాతానికి మించి పెంచలేవని సీఎం భగవంత్? మాన్ తెలిపారు. ఒకవేళ ఏదైనా పాఠశాల దీనికంటే ఎక్కువగా ఫీజులను పెంచాలనుకుంటే, సంబంధిత అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి చెప్పారు. అలాగే, గత ప్రభుత్వాలు అనవసరమైన ఫీజులు విధించడానికి ప్రైవేట్ విద్యా సంస్థలను అనుమతించాయని, దీనివల్ల విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. అయితే, విద్యా సంస్థలు, వివిధ ఖాతాల ద్వారా ఫీజులు వసూలు చేసి, విద్య పేరుతో లాభాలు ఆర్జించకూడదని తెలిపారు. మరోవైపు, ఈ ఆర్డినెన్స్?కు ఆమోదం తెలిపిన గవర్నర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. “పంజాబ్ విద్యార్థుల తల్లిదండ్రులకు అనుకూలమైన ప్రయోజనాలను చేకూర్చడానికి మేం తీసుకున్న ఈ నిర్ణయానికి ఆమోద ముద్ర వేసినందుకు గవర్నర్ సాహెబ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన ‘పంజాబ్ రెగ్యులేషన్ ఆఫ్ ఫీజు ఆఫ్ అన్‌ఎయిడెడ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (సవరణ) ఆర్డినెన్స్ 2026’పై ఆయన సంతకం చేశారు.

## హర్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హర్మూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం. మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. “మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిజానికి సోమవారం నాడే ట్రంప్ ఈ సుంకం విధింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హర్మూజ్ జలసంధికి అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ఈ కీలక మార్గంలో భద్రత కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని తిరిగి రాబట్టేందుకే ఈ సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలసంధి భద్రత కోసం ఇటువంటి చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ సుంకం ప్రతిపాదనపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన విపణిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయా దేశాలు భావించాయి. మరోవైపు, ఈ జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సహించేది లేదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, సుంకం విధింపు కంటే ఆర్థిక దౌత్యానికే మొగ్గు చూపారు.

## ఏఐ ఉపయోగించండి...

## సైబర్ భద్రత పటిష్ఠం చేయండి

బ్యాంకింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, సైబర్ భద్రతను పటిష్ఠం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంకులకు పిలుపునిచ్చారు. వినియోగదారులకే పెద్దపీట వేయాలని అన్నారు. మంగళవారం ముంబైలో ప్రభుత్వ రంగ మరియు ఎంపిక చేసిన ప్రైవేట్ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో ఆర్బీఐ నిర్వహించిన అర్ధవార్షిక సమావేశంలో ఆయన ఈ కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి ఆర్బీఐ గవర్నర్‌తో పాటు డిప్యూటీ గవర్నర్లు స్వామినాథన్ జె., డా. పూనమ్ గుప్తా, ఎస్. సి. ముర్ము, రోహిత్ జైన్‌లతో పాటు పలువురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, భారత బ్యాంకింగ్ రంగం అన్ని విభాగాల్లోనూ విస్తృతమైన వృద్ధిని సాధించిందని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో, ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకు వివేకంతో కూడిన మద్దతును కొనసాగించాలని ఆయన బ్యాంకులను కోరారు. బ్యాంకింగ్‌లో టెక్నాలజీ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని గవర్నర్ సూచించారు. దీని ద్వారా సేవలను విస్తరించవచ్చని, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని, ఖర్చులను తగ్గించుకోవచ్చని ఆయన వివరించారు. అదే సమయంలో, సైబర్ దాడుల నుంచి రక్షణకు బలమైన వ్యవస్థలు, పటిష్ఠమైన అంతర్గత నియంత్రణలు తప్పనిసరి అని నొక్కి చెప్పారు. కస్టమర్ల డేటా దుర్వినియోగం కాకుండా, మోసాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీ (జఖ్జ=), నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు, మ్యూల్ హంటర్ కార్యక్రమం, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (జదీణజ), యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (ఖూ×), అకౌంట్ అగ్రిగేటర్ ఫ్రేమ్‌వర్క్ వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమాలపై బ్యాంకుల ప్రతినిధులు తమ అభిప్రాయాలను, ఫీడ్‌బ్యాక్‌ను ఆర్బీఐకి అందించారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని వారు పునరుద్ఘాటించారు.

## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ



ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో అణ్వస్త్రాల ప్రయోగం జరగకుండా నివారించడంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని పోలండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోస్జెస్కీ ప్రశంసించారు. 2022 చివరి నాటికి ఉక్రెయిన్‌పై అణుదాడికి రష్యా సిద్ధమవుతోందన్న ఆందోళనలు వ్యక్తమైన తరుణంలో, ప్రధాని మోదీ జోక్యం చేసుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఒప్పించగలిగారని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, “ప్రధాని మోదీ అంతర్జాతీయ స్థాయిలో విశేష గౌరవం పొందిన గొప్ప రాజనీతిజ్ఞుడు. భారత్‌కు రష్యాతో చారిత్రక, సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి. అందుకే మోదీ మాటలను పుతిన్ అత్యంత శ్రద్ధతో వింటారు” అని పేర్కొన్నారు. రష్యాపై ప్రభావం చూపగలిగే అతికొద్ది మంది ప్రపంచ నేతల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు మోదీ కూడా ఒకరని బార్టోస్జెస్కీ వివరించారు. 2022 ద్వితీయార్థంలో ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చినప్పుడు, రష్యా అణ్వస్త్రాలను ప్రయోగించవచ్చన్న భయాందోళనలు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నాయి. అయితే అప్పట్లో పెను ప్రమాదం తప్పడం వెనుక మోదీ దౌత్యం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మొదట్లో రష్యా నుంచి భారత్ రాయితీపై చమురు కొనుగోలు చేయడాన్ని పోలండ్ విమర్శించినప్పటికీ, ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయని, ఒకరి ఆర్థిక, వ్యూహాత్మక అవసరాలను మరొకరు గౌరవిస్తున్నామని ఆయన తెలిపారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో భారత్ మొదటి నుంచి తటస్థ వైఖరిని అనుసరిస్తోంది. కేవలం దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని సూచిస్తోంది. అటు రష్యాతో ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తూనే, ఇటు శాంతి స్థాపన కోసం పిలుపునిస్తోంది. ఈ క్రమంలో, ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తున్న నాటో సభ్యదేశం పోలండ్ నుంచి మోదీ పాత్రపై ఈ స్థాయిలో ప్రశంసలు రావడం అంతర్జాతీయంగా భారత్ దౌత్య ప్రాముఖ్యతను చాటుతోంది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137